నవతెలంగాణ
ఆదిలాబాద్
బుధవారం | మార్చి 12, 2025 | www.navatelangana.com

చివరి ఆయకట్టు వరకు సాగునీరందిస్తాం : కలెక్టర్

కడెం : వేసవిలో రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామ శివారు పంట పొలాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా సాగు చేసిన పంటల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. పంటలకు కడెం ప్రాజెక్టు, సదర్మాట్ కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు అవసరమైన మేరకు నీటిని అందిస్తామని తెలిపారు. సాగునీటి విషయంలో రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి పంట పొలానికి ఏప్రిల్ చివరి నాటికి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, నీటి పారుదల శాఖ ఈఈ విఠల్, తాహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ పాల్గొన్నారు.



పెండ్లి చేసుకోవడం ఇష్టం లేదని యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్

జీవితంలో పెండ్లి చేసుకోవడం ఇష్టం లేదని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం..శ్రీరాంపూర్ ఏరియా లక్ష్మీనగర్‌కు చెందిన మెరుగు సౌమ్య(22) డిగ్రీ పూర్తి చేసుకొని ప్రయివేట్ జాబ్ చేస్తోంది. ఇంట్లో వారు పెండ్లి సంబంధాలు చూస్తుండగా చేసుకోవడం ఇష్టం లేదని జీవితంపై విరక్తితో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుంది. తండ్రి మల్లయ్య సౌమ్య చిన్నప్పుడే మరణించడంతో తల్లి కీర్తనతో ఉంటోంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



నకిలీ బెడద షురూ..!

- జిల్లాకు చేరుతున్న అనుమతిలేని పత్తి విత్తనాలు
- పట్టుబడుతున్నా తీరుమార్చుకోని అక్రమార్కులు
- వాటి బారినపడి ఏటా నష్టపోతున్న అన్నదాతలు
- ముందస్తుగా దృష్టిసారిస్తేనే కట్టడికి ఆస్కారం

నకిలీ విత్తనాల బెడద మళ్లీ షురువైంది. వేసవి ఆరంభంలోనే అనుమతిలేని పత్తి విత్తనాలు పట్టుబడటం కలకలం రేపుతోంది. ఏటా ఏదో విధంగా వక్రమార్గాల్లో జిల్లాలో చొరబడుతున్న నకిలీ పత్తి విత్తనాలు అన్నదాతల పాలిట శాపంగా మారుతున్నాయి. ప్రతి ఏటా పట్టుబడుతున్నా ఈ అక్రమ దందా ఆగడం లేదు. పొరుగు రాష్ట్రం నుంచి ఉమ్మడి జిల్లాలోకి ముందుగానే డంప్ అవుతున్నాయి. కొందరు ఇతర ప్రాంతాలకు చెందిన మధ్య దళారులు స్థానికులను మచ్చిక చేసుకొని ఈ దందాను నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వాలు ఈ నకిలీ విత్తనాల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ ఏదో రూపంలో అనుమతి లేని విత్తనాలు పల్లెలకు చేరడం పరిపాటిగా మారుతోంది. తాజాగా ఈ ఏడాది సైతం భీమిని మండలం కన్నేపల్లిలో అనుమతిలేని విత్తనాలు పట్టుబడటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.



కన్నెపల్లి మండలంలో ఇటీవల పట్టుబడిన నకిలీ విత్తనాలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నకిలీ విత్తనాల బెడద అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. అనుమతి లేని బీజీ3(గ్లైసిల్) విత్తనాలు మార్కెట్‌లోకి రావడం సర్వత్రా కలకలం రేపుతోంది. కిందటేడాది సైతం క్వింటాళ్ల కొద్ది నకిలీ విత్తనాలు పట్టుబడటం..అంతకుముందే రైతుల ఇంటికి చేరడంతో పంటలు వేసిన అనేక మందికి దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం అనుమతిలేని విత్తనాలను అరికట్టడానికి జిల్లాల వారీగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేసింది. గత కొన్నేండ్ల నుంచి జిల్లాల వారీగా నకిలీ విత్తనాలను పట్టుకుంటున్న అధికారులు బాధ్యులపై కేసులు నమోదు చేస్తున్నారు. కానీ ఈ దందా అక్రమార్కులకు మూడు పువ్వులు..ఆరు కాయలుగా విరాజిల్లుతుండటంతో దళారులు అంత సులువుగా విడిచిపెట్టడం లేదని తెలుస్తోంది. పొరుగు రాష్ట్రం నుంచి గుట్టుచప్పుడు కాకుండా వేసవిలోనే ఇక్కడకు అనుమతిలేని విత్తనాలు తరలించి రహస్య ప్రాంతాల్లో నిల్వ ఉంచుతున్నారు. ఇక్కడ స్థానికంగా ఉండే మధ్య దళారులను మచ్చిక చేసుకొని వారి ద్వారా గ్రామాలకు చేరవేస్తున్నారు. తక్కువ ధర..ఎక్కువ దిగుబడి పేరుతో రైతులను బురిడి కొట్టిస్తున్నారు. దళారుల మాటలను నమ్ముతున్న రైతులు తక్కువ ధరకు వస్తుండటంతో వీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

ముందస్తు కట్టడితోనే నివారణ

వేసవిలో రైతులు దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేస్తుంటారు. ఖరీఫ్‌లో వర్షాలు ప్రారంభం కాగానే విత్తనాలు విత్తుతుంటారు. దీంతో కొందరు దళారులు ఇతర రాష్ట్రాల నుంచి బస్తాల కొద్ది విత్తనాలు తీసుకొచ్చి ఇక్కడ వారి సహకారంతో నిల్వ చేస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో గ్రామాల వారీగా రైతులకు వీటిని చేరవేస్తుంటారు. ఎక్కువగా మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలనే టార్గెట్ చేస్తూ ఆయా ప్రాంతాల్లో వీటిని విక్రయిస్తున్నారు. మంచిర్యా జిల్లాలోని భీమిని, తాండూరు, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్‌తో పాటు కుమురంభీం జిల్లాలోని కాగజ్‌నగర్, కౌటాల, బెజ్జూర్, రెబ్బెన, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్ మండలాల్లో ఏటా ఈ వ్యాపారం జోరుగా సాగుతోందనే ఆరోపణలున్నాయి. కిందటేడాది సైతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు క్వింటాళ్ల కొద్ది నకిలీ విత్తనాలు పట్టుకున్న సందర్భాలున్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ వ్యక్తి లూజు విత్తనాలు తీసుకొచ్చి ప్యాకెట్లలో నింపి ఆకర్షణీయంగా తయారుచేసి విక్రయానికి సిద్ధంగా ఉంచడం కలకలం సృష్టించింది. పోలీసులు పట్టుకోవడం ద్వారా కొంత వరకు అనుమతిలేని విత్తనాలను అరికట్టగలిగారు. ఈ ఏడాది సైతం అదే పరిస్థితి పునరావృతమయ్యే అవకాశం కనిపిస్తుండటంతో అధికారులు ముందస్తుగా అలర్ట్ కావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముందస్తుగా కట్టడి చేస్తేనే కొంత వరకైనా నకిలీల బెడదను అరికట్టి రైతులను నకిలీల ఊబి నుంచి బయటపడేసేందుకు ఆస్కారం ఉంటుంది.

క్రీడలు మహిళల ఆరోగ్యానికి ఎంతో మేలు



నిర్మల్: క్రీడలు మహిళల ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం నిర్మల్ మండలం కొండాపూర్ గ్రామ సమీపంలోని నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మహిళల ప్రత్యేక క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంచే గొప్ప సాధనంగా నిలుస్తాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. విజయం సాధించినవారు విజయాన్ని మరింత ప్రేరణగా తీసుకుని ముందుకు సాగాలని, అలాగే ఇతర క్రీడాకారులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు ఈ అనుభవాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ప్రగతి సాధిస్తున్నారన్నారు. మహిళల క్రీడా ప్రోత్సాహానికి జిల్లాలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన మహిళలకు కలెక్టర్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, మహిళా ఉద్యోగులు, నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్స్ నందకుమార్, పోతన్న, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే రామారావ్ పటేల్



కుభీర్ : నియోజకవర్గంలోని ప్రతి ఒక్క గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని డోడర్నా గ్రామం నుంచి మహారాష్ట్ర సరిహద్దు అయిన వాసి వరకు ఎస్టీఎస్డీఎఫ్ నిధులు రూ.7కోట్ల68లక్షలతో రహదారి నిర్మాణానికి మండల బీజేపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోడర్నా 3,4,5 తండాలను కలుపుకొని దాదాపుగా 8 కిలో మీటర్ల వరకు రహదారి నిర్మించేందుకు నిధులు మంజూరు కావడంతో ఇక్కడి ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. గ్రామాలకు రోడ్లు బాగుంటేనే అభివృద్ధి చెందుతాయన్నారు. గతంలో ఇక్కడి గిరిజనులు రోడ్డు బాగుచేయాలని కోరారని, వారి కోరిక మేరకు నిధులు మంజూరుకు కృషి చేశానని తెలిపారు. అదే విధంగా డోడర్నా చెరువు, రోడ్లు, నీటి సమస్యలు రాకుండా ఉండేందుకు నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బోయిడి విఠల్, వద్నామ్ నగేష్, నాయకులు రాథోడ్ శంకర్, సౌంలీ రమేష్, పైడిపెల్లి గంగాధర్, బీజేపీ మండల అధ్యక్షులు ఏశాల దత్తాత్రి పాల్గొన్నారు.

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి



ఆదిలాబాద్‌టౌన్ : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయమై మంగళవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కో కన్వీనర్ కొట్నాక్ సక్కు, గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిపోయినా ఇంకా విద్యా శాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గు చేటన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, తిరుపతి, సాయి పాల్గొన్నారు.

వరుసగా ఉద్యోగాలు సాధిస్తున్న నందిని



ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తిర్పెల్లికి చెందిన జనగంవార్ సంతోష్, సంగీత దంపతుల కుమార్తె నందిని వరుసగా ఉద్యోగాలు సాధిస్తున్నారు. టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో 470.50మార్కులు సాధించారు. ఇదివరకే గ్రూప్-4లో ఉద్యోగం సాధించి ఆదిలాబాద్ మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. 2022లో జూనియర్ లెక్చరర్ పరీక్ష రాశారు. ఫలితాలు ఇటీవలే విడుదలయ్యాయి. ఇందులోనూ ఉద్యోగం సాధించారు. నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టింగ్ ఇవ్వగా బుధవారం హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా నియామక పత్రం అందుకోనున్నారు. వరుస ఉద్యోగాలు సాధించడం పట్ల కుటుంబీకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అటు స్నేహితులు, బంధూమిత్రులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నూతన ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్‌టౌన్ : నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్‌ను డీపీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంగళవారం కలిశారు. ఎస్పీని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై వారు చర్చించారు. పోలీస్ శాఖకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట బిజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్, లాలా మున్నా, జోగు రవి, రఘుపతి, రాజేష్, మహేందర్, భీంసేనారెడ్డి, రత్నాకర్‌రెడ్డి సూర్యకిరణ్, అశోక్‌రెడ్డి ఉన్నారు.

బీహార్ సైబర్ ముఠా అరెస్ట్

- సైబర్ నేరానికి పాల్పడేందుకు ముఠా యత్నం
- చాకచక్యంగా పట్టుకొని భగ్నం చేసిన పోలీసులు
- ఆరుగురిపై కేసు నమోదు, ఐదుగురు అరెస్ట్
- 2125 పాత ఫోన్‌లు, 107 సిమ్‌లు, ఐదు బైక్స్, 600 బ్యాటరీలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సైబర్ నేరాలకు పాల్పడాలని పథకం వేసిన ఘరానా ముఠాను ఆదిలాబాద్ పోలీసులు పట్టుకున్నారు. బీహార్‌కు చెందిన ముఠాను అరెస్ట్ చేసి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలు వెల్లడించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన ఆరుగురు నిందితులు ముఠాగా ఏర్పడి దేశవ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడడానికి పథకం వేసుకున్నారు. ఏ1 తబ్రక్ గ్యాంగ్ లీడర్‌గా ఉంటూ మిగిలిన ఐదుగురిని బీహార్ నుండి బైకులతో సహా తెలంగాణ రాష్ట్రానికి పంపాడు. ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ పాత మొబైల్ ఫోన్ తీసుకొని ప్లాస్టిక్ డబ్బాలను ఇస్తామంటూ ఊర్లు, పట్టణాలలో తిరుగుతున్నారు. వాటిలో లభ్యమైన సిమ్ కార్డులు, ఫోన్ల ద్వారా వివిధ రాష్ట్రాలలోని ప్రజలకు బ్యాంక్ అధికారులమంటూ ఫోన్లు చేసి వారిని సైబర్ నేరం బారిన పడేవిధంగా చేసి డబ్బులు సంపాదించాలని అనుకున్నారు. ఈ ముఠా కుట్రను పోలీసులు భగ్నం చేశారు. వీరి వద్ద నుండి దాదాపు 2125 పాత మొబైల్ ఫోన్‌లు, 107 సిమ్ కార్డులు, ప్లాస్టిక్ డబ్బాలను అమ్మడానికి ట్రేలో అమర్చి ఉన్న ఐదు ద్విచక్ర వాహనాలను, వీరు వినియోగించే ఐదు మొబైల్ ఫోన్లను, 600 మొబైల్ బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. రెండో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇదివరకే ఈ ముఠా కర్నాటక రాష్ట్రం నుంచి దాదాపు పది నుండి 12 వేల వరకు మొబైల్ ఫోన్లను సేకరించి వాటి ద్వారా వివిధ సైబర్ నేరాలకు పాల్పడ్డారు. మొబైల్ ఫోన్లో సిమ్ కార్డులు అమాయక ప్రజల పేరుపై ఉండడంతో తమపై అనుమానం రాదని, సులువుగా చట్టం నుంచి తప్పించుకోవాలని దురుద్దేశంతో ఇలాంటి నేరాలు చేస్తారని ఎస్పీ వెల్లడించారు. దేశ వ్యాప్తంగా భారీ ఎత్తున సైబర్ నేరాలకు పాల్పడాలనే ఉద్దేశంతో అరెస్టైన ఏ2, ఏ6 పెద్ద ఎత్తున సెల్ ఫోన్లు, సిమ్ కార్డులు సేకరించి బీహార్‌కు తీసుకెళ్లి ఏ1 తబ్రక్‌కు అప్పగిస్తారు. సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డుల ద్వారా ఏ1, అతని అనుచరులు దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు బ్యాంకు అధికారులమని నమ్మించి లేదా ఉద్యోగాలు ఇప్పిస్తామని, లాటరీ గెలిచారని ఫోన్ చేస్తూ ఓటిపి తెలుసుకుంటారు. అమాయక ప్రజల బ్యాంక్ అకౌంట్ నుండి డబ్బులను మళ్లించుకుంటారు. సైబర్ నేరస్తుల కుట్రను చాకచక్యంగా భగ్నం చేసిన సైబర్ క్రైం డీఎస్పీ హసీబుల్ల, డీఎస్పీ జీవన్‌రెడ్డి, టూటౌన్ సీఐ కరుణాకర్‌రావ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ప్రజలు ఫోన్లు అమ్మేటప్పుడు, కొనేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎస్పీ సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఫోన్‌లు అమ్మితే సైబర్ బారిన పడతారని పేర్కొన్నారు.

సమాజ సేవలో 'ఫాతిమా' యాజమాన్యం ముందంజ



విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న ఫాతిమా కాన్వెంట్ యాజమాన్యం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ యాజమాన్యం సమాజ సేవలో ముందంజలో ఉంది. 62 ఏండ్ల క్రితం స్థాపించిన ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు నేడు ఉన్నత శిఖరాలను అధిరోహించారు. 1963 సంవత్సరంలో ప్రారంభించిన ఈ పాఠశాలలో ఎల్‌కేజీ నుండి పదో తరగతి వరకు విద్య అందుబాటులో ఉండగా సుశిక్షితులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన కొనసాగుతోంది. ఒక వైపు మెరుగైన విద్యను అందిస్తూ, మరోవైపు సేవా రంగంలో కూడా ఈ పాఠశాల యాజమాన్యం ముందుకు సాగుతోంది. పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నిరుపేదలను గుర్తించి వారికి చలి బారి నుండి కాపాడుకోవడానికి దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేస్తున్నారు. కరోనా సమయంలో వికలాంగులకు, ఆటో డ్రైవర్లకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. పచ్చదనం-పరిశుభ్రతలో భాగంగా విద్యార్థులతో మొక్కలు నాటించి పర్యావరణ పరిరక్షణకు యాజమాన్యం కృషి చేసింది. పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులను గుర్తించి వారికి సైకిళ్లు, యూనిఫాంలు, వారి తల్లిదండ్రులకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కంప్యూటర్ పట్ల కేవలం విద్యార్థులే కాదు వారి తల్లిదండ్రులకు కూడా అవగాహన ఉండాలనే ఉద్దేశంతో ప్రస్తుతం తల్లిదండ్రులకు పాఠశాలలో అవగాహన కల్పిస్తున్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫాతిమా కాన్వెంట్‌లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆహ్వానించి వారికి దుస్తులు, పెన్నులు, నోటు పుస్తకాలను అందిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా కాన్వెంట్ యాజమాన్యం తెలిపింది.

ఉద్యోగినిగా...గృహిణిగా రాణిస్తున్న మహిళలు

- ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆలోచింపజేసిన నాటిక ప్రదర్శన



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, డీడబ్ల్యుఓ, డీఈఓ తదితరులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉద్యోగినిగా...గృహిణిగా మహిళలు రెండు బాధ్యతలు సరిసమానంగా నిర్వర్తిస్తూ ఉన్నతంగా రాణిస్తున్నారని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా విద్యార్థులు మహిళల గొప్పతనం గురించి వివరిస్తు చేసిన నాటిక, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ శాఖల్లో రాణిస్తున్న మహిళలను, పదవీ విరమణ పొందుతున్న డీఈఓ ప్రణీతను కలెక్టర్ సత్కరించి ప్రశంస పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. బాల్య వివాహాలు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలతో పాటు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడీలు అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. ఉద్యోగంలో ఉంటూ వారు చేసిన సేవలతో అనేక మందికి మంచి చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వాలు కూడా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ మహిళలను దేవతగా పూజించే ఏకైక దేశం భారతదేశమన్నారు. అన్ని రంగాల్లో వారికి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. మహిళలు కూడా వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలన్నారు. ఇటీవల పార్లమెంట్లో మహిళ బిల్లు పాస్ అయిందన్నారు. ఇప్పటికే అన్ని రంగాల్లో ఉన్న మహిళలు రాజకీయంగా కూడా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, లోకల్ కంప్లైంట్ కమిటీ చైర్‌పర్సన్ భావనసింగ్, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ అధికారి మిల్క, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, జిల్లా టీబీ అధికారి సుమలత, డీఎంసీ యశోద, జిల్లా సమాఖ్య సభ్యురాలు వనజ, మెప్మా పట్టణ అధ్యక్షురాలు ఉమాదేవి, డాక్టర్ నైనత, డాక్టర్ శ్రావ్య పాల్గొన్నారు.



కళాశాలల అభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యే బొజ్జు పటేల్



నవతెలంగాణ-దస్తురాబాద్

రాష్ట్రంలోని కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో 30 కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తదనంతరం కేజీబీవి కళాశాలలో రూ.2కోట్ల30లక్షల వ్యయంతో నిర్మించనున్న భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో చదివి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పేదరికాన్ని నిర్మూలించే ఏకైక ఆయుధం చదువు అని, ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పేదలకు మేలు చేకూరేలా ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మీ పథకం ఆర్థికంగా ఎంతో చేయూతను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, రమేష్‌రావు, కిషన్, శివయ్య గుండ నరేష్, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్పీకి స్వాగతం పలికిన ఉత్సవ సమితి సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాకు బదిలీపై వచ్చిన నూతన ఎస్పీ అఖిల్ మహజన్‌ను సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు, ముందుగా సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి, శాలువ కప్పి సన్మానించారు. ప్రతీ పండుగ కూడా



శాంతియుతంగా జరుపుకోవాలని సమితి సభ్యులకు ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు బండారి వామన్, ప్రధాన కార్యదర్శి గోడం మహాదవ్, కోశాధికారి పడకంటి సూర్యకాంత్, కందుల రవీందర్, తిప్పర్తి సత్యం, రావుల వేణు, నర్సోజీ, కిషన్ రావు, గౌరావర్ సతీష్, ఉరేడే సుభాష్ పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల హస్నాపూర్‌లో మంగళవారం మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి, ఉపాధ్యాయులు అజయ్ పవార్, జవీందర్, రవీందర్, సుధాకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, అరుణ, స్వాతి, లక్ష్మీబాయి పాల్గొన్నారు.



ప్రభుత్వాలు ప్లంబర్లను గుర్తించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భవన నిర్మాణ రంగంలో ప్లంబర్ కార్మికుల పాత్ర చాలా కీలకమైనదని ప్రభుత్వాలు ప్లంబర్లను గుర్తించాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటనారాయణ, ప్లంబర్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్, దేవిదాస్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ ప్లంబర్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఐఎఫ్టీయూ కార్యాలయం కుమురంభీం భవన్ నుంచి మొదలైన బైక్ ర్యాలీ అంబేద్కర్ చౌక్ వరకు సాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముందుగా ప్లంబర్ కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్లంబర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా ఇస్తున్న కానుకలను రెట్టింపు చేయాలని అన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు రూ10 లక్షలు ఇవ్వాలని, సహజ మరణానికి రూ.5లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. 55 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు రూ.పదివేల పెన్షన్ ఇవ్వాలని, సంక్షేమ బోర్డుని ప్రభుత్వమే నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రయివేట్ కంపెనీ ఇవ్వాలనే ఆలోచనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్లంబర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి అఖిల్, కోశాధికారి అబ్దుల్ గఫూర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్కశేషారావు, నాయకులు ఎండీ కైసర్, ఉల్లె రాజ్, జనార్ధన్, రాజు, లక్ష్మణ్, అజీం ఉన్నారు.

అబద్ధం ఆడటం కంటే, రాజీనామా చేయడం మేలు

- మాజీ మంత్రి జోగు రామన్న



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీసీఐ పరిశ్రమను తుక్కు కింద అమ్మేయడాన్ని టెండర్లు ప్రకటించగా విషయాన్ని బయట పెట్టడంతో స్థానిక ఎంపీ ఎమ్మెల్యే అబద్ధాలు మాట్లాడటం జరుగుతుందని, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్ర, రాష్ట్ర పనులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీ, ఎయిర్‌పోర్ట్ విషయంలో ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారనీ, దీనికంటే రాజీనామా చేయడం ఉత్తమమన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎంపీ వ్యాఖ్యలు నిజమైతే తన స్వగ్రామమైన జాతర్లలోని శివాలయంలో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించమన్నారు. జోగు రామన్న ప్రజా అభిప్రాయాలకు అనుగుణంగా అభివృద్ధి చేశానే తప్ప మోసపూరిత మాటలు చెప్పలేదని గుర్తు చేశారు. స్థానిక ఎంపీ ఎమ్మెల్యేలు ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసే పరిశ్రమల విషయంలో యువతతో పాటు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి లక్ష్యంగా వేలకోట్ల రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వంలో టీఎస్ఐఎస్ ద్వారా సీసీఐ నిర్మాణంతో పాటు సీసీఐ పునర్ ప్రారంభించడానికి కృషి చేయడం జరిగిందన్నారు. గతంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో వాజ్‌పాయి ఉన్నప్పుడు సీసీఐ పరిశ్రమను మూసివేసి వేశారన్నారు. తిరిగి 11 ఏండ్లుగా బీజేపీ కేంద్ర ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికిని సీసీఐ పరిశ్రమను పునర్ ప్రారంభించకపోవడం స్థానిక ఎంపీ ఎమ్మెల్యేల అసమర్థతనే అన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ సీసీఐ పరిశ్రమను అమ్మేది లేదని, పునర్ ప్రారంభం దిశగా బీఆర్ఎస్ గత కొన్ని ఎండ్లుగా నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు విజ్జగిరి నారాయణ, పట్టణాధ్యక్షులు అజయ్, మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, దమ్మ పా ల్,పండ్ల సీను, పందిరి భూమన్న, నల్ల మహేందర్, దేవిదాస్, రాహుల్, దయాకర్, వినోద్ పాల్గొన్నారు.

వెడ్మ ఫౌండేషన్‌కు రూ.50వేల విరాళం అందజేత



నవతెలంగాణ-ఉట్నూర్

నిరుపేదలకు, నిస్సాయులకు, విద్యార్థులకు, రైతులకు వెడ్మ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను గుర్తించి, యూత్ కాంగ్రెస్ నాయకులు సల్లు భాయ్ తనవంతుగా రూ.50వేలు విరాళాన్ని వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెడ్మ ఫౌండేషన్ నిత్యం ప్రజాసేవలో ఉంటుందన్నారు. దార్శనిక విద్య, బహుళ వ్యవసాయం, సామాజిక సేవ అనే లక్ష్యాల సాధన వైపు పని చేస్తోందన్నారు. స్వచ్ఛందంగా దాతలు ముందుకు వచ్చి రూ.50 వేల విరాళాన్ని తమ ఫౌండేషన్‌కు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, విరాళం అందించిన సల్లు భాయ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. వారు అందించిన ఆర్థిక సాయం పేదలకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ మోబిన్ ఉన్నారు.

పేదోడి సొంతింటి కల నెరవేరనుంది



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, నాయకులు

నవతెలంగాణ-కడెం

ప్రజా ప్రభుత్వం హయంలోనే పేదోడి సొంతింటి కల నెరవేరనుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని రైతు వేదిక భవనంలో 58 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు కళ్యాణలక్ష్మి ఒక వరమని, అలాగే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం నర్సాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాల అందేలా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా అమలు పరుస్తుందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర సర్కార్ పని చేస్తోందని, ఇది పేదల ప్రభుత్వమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీఓ అరుణ, ఎంపీఓ కవిరాజ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, పీఏసీఎస్ చైర్మెన్ శైలజ రమేష్ రావు, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు శ్రీనివాస్, పట్టణాధ్యక్షులు వాజీద్ ఖాన్, యువజన కాంగ్రెస్ నిర్మల్ జిల్లా కార్యదర్శి మూడుకే మల్లేష్ యాదవ్, మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, ఆకుల బాలవ్వలచ్చన్న, భూమేశ్వర్ కాంగ్రెస్ సీనియర్

నాయకులు పడిగెల భూషణ్, తాళ్లపెల్లి రమేష్, బబ్లు, ఇస్రు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

లక్ష్మణచాంద మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి భూమిపూజ చేశారు. ముందుగా మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ భవన నిర్మాణానికి, పొట్టపెల్లి గ్రామంలో సీసీ రోడ్డు, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ గౌడ్, భూపాల్‌రెడ్డి, మండలాధ్యక్షులు చిన్నయ్య, మాజీ ఎంపీపీలు అడ్వాల రమేష్, సరికెల గంగన్న, మాజీ సర్పంచ్ ముత్యం రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ఓస రాజు, రాజేశ్వర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, పోశెట్టి, రాజు, అశోక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై ఒత్తిడి తెస్తాం

- ఎమ్మెల్యే పాయల శంకర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజవర్గానికి 3500 ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచిన, ఒక్క ఇల్లుకు పునాది పడలేదని పేర్కొన్నారు. ఏ గ్రామంలో ఎవరికి మంజూరు చేశారనేది కూడా తెలియదన్నారు. ఆరు గ్యారంటీ అమలుపై శాసనసభలో ఎండగడతామని అన్నారు. రాష్ట్ర సమస్యలపై ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లి నరేంద్ర మోడీని కలిస్తే, రాష్ట్ర వాటా చెల్లించకపోవడం వల్ల అమలు కానీ కేంద్ర పథకాలపై సమీక్షించుకోవాలని సూచించారని తెలిపారు. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సైతం ఇవ్వకపోవడంతో అనేక పథకాల అసంపూర్తిగా మిగిలిపోయాయని పేర్కొన్నారు. వచ్చే బడ్జెట్‌లో పథకాల వారిగా నిధులు కేటాయించి, అమలు అయ్యేలా చూడాలని అన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్, జోగు రవి, రత్నాకర్‌రెడ్డి, లాలమున్న, భీంసేనరెడ్డి, ముకుందరావు, సతీష్ ఉన్నారు.

సమస్యను పరిష్కరించకుంటే పురుగులమందు తాగి చస్తాం



పురుగులమందు డబ్బాతో సబ్‌స్టేషన్‌లో కూర్చున్న బాధితులు

నవతెలంగాణ-నేరడిగొండ

విద్యుత్ సమస్యను పరిష్కరించకుంటే పురుగులమందు తాగి చస్తామని మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన సంతోష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆయన పురుగులమందు డబ్బా పట్టుకుని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ గృహ నిర్మాణానికి విద్యుత్ తీగెలు అడ్డుగా ఉన్నాయని వాటి తొలగించేందుకు పలుమార్లు విన్నవించానని తెలిపారు. ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి పిల్లర్లను నిర్మించామని, పిల్లర్లకు విద్యుత్ లైన్ దగ్గరగా ఉందని దీని ద్వారా పనిచేసే సమయంలో కార్మికులకు అలాగే ఇంటి వారికి ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్లాబ్ కూడా వేసేది ఉందని అన్నారు. కరెంట్ షాక్ తగలకుండా ఉండటానికి వాటికి పైపులు వేయాలని కుప్టి ఫీడర్ లైన్ మెన్ మురళిని కోరగా దాదాపు ఐదు ఆరు రోజుల నుంచి రేపు మాపు అంటూ రోజులు గడుపుతున్నాడే తప్ప రావడంలేదని అన్నారు. ఏఈకి వినతిపత్రం ఇవ్వాలని చెప్పడంతో ఏఈకి కూడా వినతిపత్రం ఇచ్చానని అయినా కూడా పట్టించుకోవడంలేదని అన్నారు. తమకు న్యాయం చేసేంతవరకు ఇక్కడి నుంచి వెళ్ళేది లేదని, ఇక్కడే పురుగులమందు తాగి చనిపోతామన్నారు. కనీసం ఫోన్ ద్వారా సంప్రదించిన ఫోన్ లేపడం లేదని స్విచ్ ఆఫ్ చేసుకుంటున్నారని తెలిపారు. ప్రమాదం జరగకుండా ముందే స్పందించి న్యాయం చేయాలని కోరినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై ఏఈ నాగేంద్ర మాట్లాడుతూ మీరు ఎలాంటి ఇబ్బందులు పడవద్దని, మీ ఊరికి వచ్చి పరిశీలించి, సమస్యను పరిష్కరించేందకు కృషి చేస్తానని అన్నారు.

ప్రశంసా పత్రాలు అందుకున్న సామంత్



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని మారుమూల గ్రామమైన గోదారిగూడకు చెందిన బోర్లకుంట బుచ్చన్న, చంద్రకళ దంపతుల కుమారుడు సామంత్ కుమార్ పట్టణంలో ఛాలెంజ్ డాన్స్ అకాడమీ అనే పేరిట డాన్స్ ఇన్స్టిట్యూట్‌ను పెట్టి గత 3 సంవత్సరాలుగా పరిసర వాసులకు వయసుతో సంబంధం లేకుండా చిన్న నుంచి పెద్దవారికి క్లాసికల్, వెస్టర్న్, ఫోక్, సాల్సా, కాంటెం పోరరీ, జూంబ, ఏరోబిక్స్ పలురకాల డాన్స్ నేర్పుతున్నాడు. తను అకాడమీ కాకుండా 11 సంవత్సరాలుగా పాఠశాలల్లో, కళాశాలాల్లో నిర్వహించే అన్ని రకాల కార్యక్రమాలకు, యూట్యూబ్‌లో ఆల్బమ్ సాంగ్స్, అలాగే అకాడమీ లో శిక్షణ పొందుతున్న పిల్లలను మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించిన డ్యాన్స్ క దంగల్, ముంబైలో నిర్వహించిన ఇండియన్ డాన్స్ పవర్ లాంటి షోస్‌లో పాల్గొన్ని భరతనాట్యం, ఫోక్‌లో ప్రత్యేక గుర్తింపు పొందుపరిచ్చినందుకు 26 జనవరి 2025 రోజున వరల్డ్ బుక్ రికార్డు నుంచి బెస్ట్ డాన్స్ కోరియోగ్రాఫర్, డైరెక్టర్‌గా అవార్డు అందుకున్నాడు. డాన్స్ మాత్రమే కాకుండా ఎడిటింగ్, డబ్బింగ్, సింగర్, లిరిసిస్ట్, డైరెక్షన్, ప్రొడక్షన్, మేకప్, హెయిర్ స్టైలిష్, యాక్టింగ్ ఇలా ప్రతిదీ చేస్తూ మల్టీ టాలెంట్ పర్సన్‌గా సోషల్ మీడియాలో సామంత్ చింటు అనే పేరు సంపాదించుకున్నాడు. వరల్డ్ బుక్ రికార్డ్ స్థాయికి ఎదుగుదల యువతకి స్ఫూర్తిదాయకమని సామంత్ కుమార్ బోర్లకుంటని తనకు లభించిన వరల్డ్ బుక్ రికార్డ్ సర్టిఫికెట్, మెడల్, షీల్డ్‌ను ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బు, పీవీటీజీ ఏపీఓ మెస్రం మనోహర్‌ల చేతుల మీదుగా ప్రశంసించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన వడ్డెర సంఘం నాయకులు



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం వడ్డెర సంఘం నాయకులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బొంతుకుల శ్రీను, కుంచపు గోవింద్, గోగుల సీతారాం, బోదాసు నరేష్, శివరాత్రి శేఖర్, మల్లేష్, బోదాసు రవి, రాములు, హనుమంతు, సాయిలు, నర్సయ్య, పోశెట్టి, నర్సింలు, లింగయ్య ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

- ఐదుగురు జూదరుల అరెస్ట్, ఒకరి పరారీ



పోలీసులకు పట్టుబడ్డ పేకాటరాయుళ్లు

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని గిమ్మ గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై వి.పురుషోత్తం తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో పట్టుబడ్డ ఐదుగురును అరెస్ట్ చేసినట్టు ఎస్సై తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... పేకాట ఆడుతున్న గంద్రత్ సతీష్, ఐన్ల కిరణ్ కుమార్, కందుల సాయి కృష్ణ, జి.సతీష్, ఎన్.రాకేష్, శ్రీకాంత్ (పరారీ)లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.43వేల 290 నగదును సీజ్ చేసినట్టు తెలిపారు. జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు చేపట్టవద్దని, ఎక్కడ పేకాట, మట్కా, గుట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యక్రమాలకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అట్టి వారిపై ఉక్కుపాదం మోపాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ సూచనల మేరకు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో నిఘా పటిష్ఠం చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ డి.సాయినాథ్ తెలిపారు. జైనథ్ ఎస్సై, సిబ్బంది, ఏఎస్సై స్వామి, శివాజీ, వికాస్‌లను అభినందించారు. మండలంలో ఎక్కడైనా పేకాట, మట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నట్లయితే సమాచారం జైనథ్ సీఐ 8712659916, జైనథ్ ఎస్సై 8712659929లకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 66 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముభారక్ చెక్కులను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, పేదలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ




నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సోన్ మండలానికి చెందిన 59 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో పెండ్లి అయిన ఆడబిడ్డలకు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేష్, ఎంపీఓ ఖలీం, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు మారి గంగారెడ్డి, గంగన్న, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఎస్సీల వర్గీకరణను అమలు చేసేంత వరకు నిరసన దీక్షలు కొనసాగుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంబ్లె బాలాజీ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందర చేపట్టిన నిరసన దీక్షలను యధావిధిగానే కొనసాగుతుందన్నారు. గ్రూప్ 1, 2, 3లతో పాటు అన్ని రకాల ఫలితాలను నిలుపుదల చేయాలని కోరారు. ప్రతి ఉద్యోగంలో ఎస్సీల వర్గీకరణను వర్తింపు చేయాలనీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చినా హామీలను రేపటి నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీలో అమలు చేయాలన్నారు. ఈ



కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కాంతారావు, ఉట్నూర్ డివిజన్ ఇన్‌చార్జి రాంప్రసాద్, అశోక్, విష్ణు, సురేష్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా విగ్రహా ప్రతిష్టాపన

నవతెలంగాణ-కడెం

మండలంలో ధర్మాజీపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని పాత రేవోజీపేట్ గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. మంగళ, బుధ రెండు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా నూతన ఆలయం వద్ద ప్రత్యేక హోమాలు, యజ్ఞాలు, గణపతి పూజ, నవగ్రహ పూజ, సర్వతో భద్ర మండలం తదితర పూజా కార్యక్రమాలు వేద పండితులు కుచనపల్లి చిన్న నర్సయ్య, బిక్కునూరి ఈశ్వర ఆచార్యుల మంత్రోత్సరణల మధ్య వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు, జాలాది వాసం కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

బాలరక్ష భవన్ అటెండర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలో అధికారికంగా నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మూడు సంవత్సరాల నుండి బాల రక్ష భవన్‌లో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సావిత్రిని సన్మానించారు. శాలువతో సత్కరించి మిఠాయి తినిపించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్, బాల రక్ష భవన్ సిబ్బంది శ్రావణ్ కుమార్, శ్రీనివాస్, బాల ప్రవీణ్ కుమార్, చంద్ర శేఖర్, ప్రవీణ్ కుమార్, నసీర్ ఉస్మాన్, నవీన్, ఝాన్సిరాణి పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలపై అవగాహన

నవతెలంగాణ-కౌటాల



బ్యాంక్ సేవలపై మండల కేంద్రంలోని మండల సమైక్య భవనంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కౌటాల శాఖ ఆధ్వర్యంలో ఆర్‌బీఐ అధికారులు అవగాహన కల్పించారు. ఆర్బీఐ అధికారులు ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది ద్వారా ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అండ్ అవేర్నెస్ ట్రైనింగ్ ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథులుగా బీఎల్ రాయుడు, ఎం.హరీష్ డిజిటల్ పేమెంట్స్ ప్రాముఖ్యతను వాటివల్ల కలిగే లాభాలు, డిజిటల్ మోసాల గురించి వివరించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రమేష్, ఏపీఎం ముక్తేశ్వర్, ఎఫ్‌డీఎల్‌సీ విస్వీనర్లు, వీఓ అధ్యక్షులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్స్, వీఓ సభ్యులు ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

డోర్లి ఓసీ-2ను సందర్శించిన అధికారులు



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా లో మూత పడిన డోర్లీ ఓసీ-2 గనిని నాగ్‌పూర్ కోల్ కంట్రోల్ కార్యాలయ ఓఎస్‌డీ సందీప్ ఎస్ పరాంజ పే, డబీ సుబ్రమణ్యం మంగళవారం సందర్శించారు. మూత పడ్డ గని మరియు పరిసర ప్రాంతాల్లో చేపట్టిన పర్యావరణ పనులు పరిశీలించారు. నాటిన మొక్కలను, ఎదిగిన వృక్షాలను చూశారు. పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న నీటి నిర్వహణ, మృత్తిక సంరక్షణ చర్యలు వాటి వివరాలను తెలుసుకున్నారు. రక్షణ కంచేలను చూశారు. అంతకు ముందు జీఎం కార్యాలయంలో ఇన్‌చార్జి జీఎం ఎం.నరేందర్ అధికారులకు బెల్లంపల్లి ఏరియా వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రాజమల్లు, ఏరియా సర్వే అధికారి అఫ్సర్ పాషా, డిప్యూటి ఎస్ఎస్ఓ శేఖర్, కార్పోరేట్ అదనపు మేనేజర్లు వి తిరుపతి, బాబ్జీ, డోర్లి ఓసీ-2 మేనేజర్ మహేష్, ఎన్విరాన్మెంట్ అధికారి హరీష్, ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి, ఎస్టేట్ అధికారి రజినీకాంత్ పాల్గొన్నారు.

స్పందించి..పరీక్ష కేంద్రానికి తరలించి



నవతెలంగాణ-తిర్యాణి

ఇంటర్ పరీక్ష సెంటర్‌కు వెళ్లడానికి ఇద్దరు విద్యార్థినులకు ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పరీక్షా కేంద్రానికి సమయానికి అందుతామో లేదో అని భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన ఏఎస్ఐ నారాయణ తన ద్విచక్ర వాహనంపై పరీక్షా కేంద్రానికి సమయానికి తీసుకెళ్లారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ప్రతి ఒక్కరూ వాహనాలపరంగా వారికి లిఫ్ట్ ఇచ్చి వారికి తగిన సహాయం చేయాలని ఏఎస్సై కోరారు. సమయానికి పరీక్షా కేంద్రానికి తీసుకువచ్చిన ఏఎస్ఐ నారాయణకు విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల విద్యార్థులను పరీక్ష సమయానికి తీసుకువచ్చిన ఎఎస్ఐ నారాయణను ఎస్పీ డివి శ్రీనివాసరావు అభినందించారు.

ఉపాధి హామీ పనులు నాణ్యతతో ఉండాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధి హామీ ద్వారా చేస్తున్న పనులు నాణ్యత ప్రమాణాలను కూడుకొని ఉండాలని పంచాయతీరాజ్ విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈ సూర్య ప్రకాష్ అన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధి హామీ కింద పనులు చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులతో పాటు అధికారులతో పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేసే పనిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. రానున్న రోజుల్లో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పరీక్షించిన తర్వాతనే బిల్లుల చెల్లింపు జరుగుతుందని తెలిపారు. పనులు పూర్తి చేయడంలో అలసత్వం వహించకూడదన్నారు. ఈ సమావేశంలో డీఈ కృష్ణ, డివిజన్ల డీఈలు, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుండి మల్లన్న పట్నాలు

నవతెలంగాణ-తిర్యాణి

మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం ఆవరణలో మండల కాపు సంఘం ఆధ్వర్యంలో స్వయంభుగా కొలువైన శ్రీ మల్లికార్జున స్వామికి పట్నాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్టు సంఘం నాయకులు తెలిపారు. మొదటగా పచ్చని పందిరి, అనంతరం గ్రామ దేవత పోచమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గంగా స్నానం, సాయంత్రం కూర్రలు పట్టుట, మహిళల పోలు కార్యక్రమం, సుంకు బియ్యం దంచుట, తిరిగి రేపు ఉదయం మల్లన్న కళ్యాణం అనంతరం స్వామి వారి నాగవెల్లి నిర్వహించనున్నట్టు ఒగ్గు పూజారులు పుర్ర నాగేష్ తెలిపారు. మండలంలోని ప్రజలంతా అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-జైనూర్

పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఏజెన్సీ మండలాలైన జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, నార్నూర్, తిర్యాణి లాంటి మండలాల్లో ఉన్న ప్రజలు ఈ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పోలీస్‌స్టేషన్ ముందు ఉన్న క్రికెట్ మైదానంలో వైద్య శిబిరం ఉంటుందన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు సత్యసాయి ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని గుండి రహదారిలో గల సత్యసాయి ఆలయ దశమ వార్షికోత్సవాన్ని నేడు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవ సమితి ప్రతినిధులు తణుకు దత్తు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం ఐదు గంటలకు నగర సంకీర్తనతో ప్రారంభమయ్యే ప్రత్యేక కార్యక్రమాలు, రాత్రి 7 గంటలకు సామూహిక భజన మహా మంగళహారతితో ముగుస్తాయని, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

- కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మహిళ ఉద్యోగిని సన్మానిస్తున్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థిక అభివృద్ధి సాధించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో మహిళా శిశుసంక్షేమ శాఖ మహిళా సాధికారిక ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసనంతరం మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని, స్వశక్తితో ఎదిగి ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ఏ పనిలో విజయం సాధించాలన్నా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో అవసరమవుతుందన్నారు. ఏ పనిచేయాలన్నా శ్రద్ధతో చేయాలని, అనుకున్న లక్ష్యాన్ని చేరేలా పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ఆడ, మగ తేడా లేకుండా పిల్లలందరిని సమానంగా చూడాలన్నారు. బాల్య వివాహాలను జరుకుండా చూడాలన్నారు. ఈ విషయంలో మహిళలు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సావిత్రిబాయి పూలే వంటి మహానీయులను ఆదర్శంగా తీసుకొని మహిళలు స్వశక్తితో ఎదగాలని సూచించారు. కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో పదోతరగతి ఉత్తీర్ణత శాతం తగ్గుతూ వస్తుందని, ఈ సారి వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలను ప్రోత్సాహించేలా అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా మహిళా భాగస్వామ్యం కల్పించేలా కార్యక్రమాలను అమలు చేస్తున్నాయన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం పదేండ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. దీని ద్వారా బాలికల్లో అక్షరాస్యత శాతం పెరుగుతుందని, ఆడ పిల్లల రక్షణ కోసం అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయని అన్నారు. అవగాహన కల్పించేందుకు జిల్లాలో మోటివేషన్ స్పీకర్లను నియమించినట్లు చెప్పారు. మహిళా హక్కులు, సాధికరత, సమానత్వం సాధించేందుకు ప్రతి మహిళా కృషి చేయాలని, అభివృద్ధిలో మహిళలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా మాట్లాడుతూ రాబోయే భావితరాలకు మహిళలు ఆదర్శంగా నిలబడాలని సూచించారు. ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకుని వాటిని సాధించేందుకు ప్రయత్నించాలని కోరారు. అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని, చదువుల్లో ముందుండాలని అన్నారు. ఈ పోటీ ప్రపంచంలో మహిళలు కుడా పోటీలను తట్టుకుని విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలని అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని మహిళలందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే కుటుంబ సభ్యులు, సమాజం వారిని గుర్తిస్తుందని తెలిపారు. లోకంలో మహిళ తమ విలువను తెలుసుకోవాలని, ఆత్మ న్యూనతా భావాన్ని విడనాడాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నాయని పేర్కొన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని వ్యాపారవేత్తలుగా ఎదిగి తమ కాళ్లపై తాము నిలబడాలని పిలుపునిచ్చారు. భ్రూణ హత్యలు, బాల్యవివాహాలు అరికట్టినప్పుడే సమాజం పురోభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ భాస్కర్, మహిళా సాధికారిక కేంద్రం కోఆర్డినేటర్ శారద, సీడీపీఓలు, మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలం పాటను రద్దు చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి

సింగరేణిలో ఉన్న బొగ్గు బ్లాకుల వేలంపాటను రద్దుచేసి సింగరేణి సంస్థకే కేటాయించాలని టీఎన్టీయూసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లిలోని టీఎన్టీయూసీ కార్యాలయంలో జరిగిన నాయకుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు ఉద్యమాలు త్యాగాల ఫలితమే నేడు సింగరేణి కార్మికులు అనుభవిస్తున్న హక్కులు, సౌకర్యాలు, ఉపాధి కల్పనకు కల్పతరువు తెలంగాణ కొంగుబంగారం సింగరేణి ఇప్పుడు సింగరేణిలో సంస్కరణల కారణంగా ఇబ్బందులు వస్తున్నాయన్నారు. సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని ఎంఎండీఆర్‌ను జాతీయ కార్మిక సంఘాలు అడ్డుకోలేకపోయారని ఆరోపించారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు ముందు ఆరు గారంటీలను అమలు చేస్తామని ఇచ్చిన హామీలను కాంట్రాక్ట్ కార్మికులను కూడా పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జీఎం కార్యాలయాల ఎదుత ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యననియన్ ఉపాధ్యక్షుడు గజ్జల నారాయణ, జీవరత్నం, బొల్లు మల్లయ్య, డి.రాజయ్య, బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఓదేలు ఎం గోపాల్స, బి.సత్యనారాయ మహేష్ల యాదవ్ పాల్గొన్నారు.

వందమంది కూలీలతో పని చేయించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో ప్రతి పంచాయతీలో కనీసం వందమంది కూలీలతో పనులు చేయించాలని ఎంపీడీఓ రమేష్ పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులను ఆదేశించారు. కాగజ్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీలను గుర్తించి త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. కూలీలకు కూలితో పాటు గ్రామ పంచాయతీని అభివృద్ధిని చేయాలని సూచించారు. అదే విధంగా మండలంలోని 28 పంచాయతీలో గ్రామపంచాయతీ నర్సరీలను జాగ్రత్తగా నిర్వహించాలని, ప్రజలకు అవసరమైన మొక్కలను గ్రీన్ యాక్షన్ ప్లాన్ ప్రకారం పెంచాలని ఆదేశించారు. 31మార్చి2025లోగా మెటీరియల్ పనులన్నీ పూర్తి చేయించి పేమెంట్ చేయాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ ప్లాంటేషన్లకు వాచర్లను నియమించాలన్నారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీటిని అందించాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుండి పనులు చేపించడానికి అవసరమైన పనులు, మంజూరు చేసుకోవాలని పనులు చేయించడానికి సిద్ధంగా ఉండాలని సాంకేతిక సహాయకులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని, 31 మార్చి 2025లోగా ఇంటి పన్ను 100శాతం వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఏపీఎం బుచ్చన్న, సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పద్మశాలీల పాలాభిషేకం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీకి స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో పద్మశాలీలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి పద్మశాలీ సేవ సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్లా ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో పద్మశాలీగా జన్మించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వైద్య కళాశాలకు పేరు పెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కొండ లక్ష్మణ్ బాపూజీ స్వతంత్ర పోరాటంలో కీలకంగా వ్యవహరించడంతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన పదవులను సైతం లెక్కచేయకుండా రాష్ట్రం వచ్చేదాకా పోటీ చేయనని ప్రకటించిన మహానీయుడని కొనియాడారు. బాపూజీ పేరును కళాశాలకు పెట్టడం గర్వించదగ్గ విషయమని అన్నారు. వాంకిడి మండల కేంద్రంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవాసదన్ సంస్థ చెందిన భూమిలో ఆయన స్మృతి వనాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని ఇందుకు ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ రూ.30 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. పద్మశాలీల పక్షాన సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పద్మశాలి జాతీయ, రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసి పలు సంక్షేమ పథకాలకు నాంది పలికిన జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర అధ్యక్షులు కామర్తపు మురళి, ప్రధాన కార్యదర్శి రామచంద్ర రావుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నల్ల కనకయ్య, గుండా శంకర్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అనుమాండ్ల శ్రీకాంత్, అల్లె శ్రీకాంత్, గౌరవ అధ్యక్షులు కోమటిపల్లి లింగయ్య, మహిళా అధ్యక్ష, కార్యదర్శులు జంజిరాల పుష్పలత, చెన్నూరి సునీత, సంఘం సీనియర్ నాయకురాలు ఇరుకుల్ల మంగ, ఆవిడపు ప్రణయ్, సిరిపురం భద్రయ్య, గుండా శ్యామ్, గాజర్ల శైలేందర్, చిప్ప సురేష్ పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

ప్రతిభ పరీక్షతో మరింత మెరుగైన ఫలితాలు : కలెక్టర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షల ద్వారా మరింత మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో నిర్వహించిన ఎస్ఎస్‌సీ టాలెంట్ టెస్ట్ ఫలితాలను అదనపు కలెక్టర్ డేవిడ్, ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో ప్రతిభ పరీక్ష నిర్వహించడం వల్ల ఫలితాలు మెరుగయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. ఎస్ఎఫ్ఐ చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకె సాయికుమార్, చాపిలె సాయిక్రిష్ణలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా దాదాపు 3,000 మంది విద్యార్థులు ఈ ప్రతిభా పరీక్ష రాశారని, పరీక్ష రాసిన విద్యార్థులు వారి ఫలితాలను సంబంధిత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని వద్ద చూసుకోవచ్చున్నారు. పరీక్ష నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, నాయకులు బాలాజీ పాల్గొన్నారు.

నంబాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ప్రారంభం



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని నంబాల సబ్‌స్టేషన్‌లో తక్కలపల్లి ఫీడర్‌కు కొత్త బ్రేకర్‌ను విద్యుత్ శాఖ ఎస్ఈ రాథోడ్ శేషారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయటానికి కొత్త బ్రేకర్ ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ బి.విరేష, ఏడీఈ ఫిరజ్‌ఖాన్,సంతోష్, రెబ్బెన ఏఈ ఇమ్రాన్, విద్యుత్ సిబ్బంది రాయిస్, సురేష్, హరీష్, సత్తయ్య, నసీరుద్దీన్, మధు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

విద్యార్థి దశ చాలా కీలకమైంది కేవలం చదువుపైనే ధ్యాస ఉంచి, విద్యార్థులకు విద్యనే ఆయుధమని భావించి మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని మండల విద్యాధికారి వేణుగోపాలరావు అన్నారు. మంగళవారం మండలంలోని వేంపల్లి ఎంపీపీఎస్ పాఠశాలకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు షేక్ చాంద్ ఒక స్పీకర్, మైక్ సెట్‌ను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంతి తీసుకున్న విద్యార్థులపై మక్కువతో తన వంతు ఎంతో కొంత సహాయం చేయాలని ఆలోచిండం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు బాజీఖాన్, రాజేశ్వరి, కళ్యాణి, సిఆర్పి రమేష్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రజాలైఫ్ కేర్ ఆస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి 27 మంది రాగా వారిని పరీక్షించారు. ఇందులో 21 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. విడతల వారిగా ఆపరేషన్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే ప్రతి మంగళవారం కంటి పరీక్షలు నిర్వహిస్తామని కంటి శుక్లాలున్నవారు, కంటి చూపు మందగించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని ఫౌండేషన్ అధ్యక్షులు డా.పాల్వాయి హరీష్ బాబు సూచించారు.

ఎమ్మెల్సీని సన్మానించిన అరిగెల

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన అంజిరెడ్డి దంపతులను మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సమస్యలను నూతన ఎమ్మెల్సీ దృష్టికి తీసుకు వెళ్ళగా పరిష్కారం కోసం ప్రయత్నాలు చేస్తానని హామీ ఇచ్చినట్లు వివరించారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలో చోటు చేసుకున్న పలు అంశాలను కూడా ఎమ్మెల్సీకి వివరించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ గెలుపు కోసం తాము చేసిన కృషిని వివరించామన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని ఎమ్మెల్సీ సూచించినట్లు తెలిపారు.

17న దిన, వారసంతలకు వేలంపాట

నవతెలంగాణ-జన్నారం

ఈ నెల 17 సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంత ప్రతి రోజు నిర్వహించే దినసంతల కోసం వేలంపాట నిర్వహించడం జరుగుతుందని పొన్కల్ ఈఓ రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలం పాటలో పాల్గొనదలచిన వారు వారసంత కోసం రూ.20, 000 దినసంత కోసం రూ.10 వేల డిపాజిట్ చేయవలసి ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ డిపాజిట్లు తీసుకోవడం జరుగుతుందన్నారు. వేలం పాటలో పాటను తగ్గించుకున్న వారు అదే రోజు సాయంత్రం వరకు మొత్తంలో 75 శాతం పంచాయితీకి చెల్లించవలసి ఉంటుందన్నారు. మిగతా డబ్బులను సెప్టెంబర్ 30 లోపు చెల్లించవలసి ఉంటుందన్నారు. చెల్లించని ఎడల ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వారి అర్హతను రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు గ్రామ పంచాయతీకి ఎలాంటి బాకీలు ఉండకూడదన్నారు. గ్రామపంచాయతీ నిర్ణయించిన రేట్లు మాత్రమే వసూలు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణ పరిధిలో ఏర్పడే విద్యుత్ అంతరాయాలు తగ్గించడంతో పాటు తక్షణమే తలెత్తిన సమస్యలు పునరుద్ధరించేలా ఎమర్జెన్సీ రిస్టోర్ టీంలను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ సూపరిండెంట్ ఇంజనీర్ గంగాధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సాంకేతికంగా సమస్యల వలన విద్యుత్ సరఫరా లో ఏర్పడే అంతరాయాలను తగ్గించడానికి బ్రేక్ డౌన్ టీంలను ఏర్పాటు చేసుకున్నామని, ఎమర్జెన్సీ రిస్టోర్ టీం వాహనాల ద్వారా జీపీఆర్ఎస్ లొకేషన్ ఆధారంగా సమస్యలు ఉన్న ప్రాంతానికి వెళ్లి తలెత్తిన సమస్యలు పునరుద్ధరించేలా ఈ వాహనాలు ఉపయోగ పడుతాయన్నారు. వాహనంలో థర్మో విజన్ కెమెరాలు, రంపాలు, టార్చ్ లైట్లు, నిచ్చెనలు, ఇన్సులేటర్లు, కండక్టర్లు, కేబుల్స్‌తో పాటు ఇతర పరికరాలు ఉంటాయన్నారు. ఈ బ్రేక్ డౌన్ టీంలో ఆరుగురు సభ్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటరాని పేర్కొన్నారు. వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి విద్యుత్ శాఖ ఆహర్నిశలు కృషి చేస్తుందని పేర్కొన్నారు.

బెల్లంపల్లి కేవీకేలో రైతు నేస్తం కార్యక్రమం



నవతెలంగాణ-తాండూర్

రైతు నేస్తం కార్యక్రమాన్ని బెల్లంపల్లి కేవీకేలో నిర్వహించడానికి, ఏర్పాటుచేసిన దృశ్య శ్రవణ పరికరాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని, వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి అల్దాస్ జానయ్య, చేతుల మీదుగా ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి కేవీకే ప్రోగ్రాం డైరెక్టర్ శివకృష్ణ మాట్లాడుతూ రైతు నేస్తం కార్యక్రమాల ద్వారా మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రైతులు, సాగు చేస్తున్న పంటల యాజమాన్యం సస్యరక్షణ చర్యలు వ్యవసాయ అనుబంధ రంగాల పైన శాస్త్రవేత్తలతో నేరుగా చర్చించే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటివరకు వ్యవసాయ శాఖ ద్వారా అందుబాటులో ఉన్న ఈ సేవలను శాస్త్రవేత్తలతో అనుసంధానం చేసేలా 8 కృషి విజ్ఞాన కేంద్రాలు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాలకు విస్తరించడం జరిగిందన్నారు. తద్వారా స్థానికంగా సాగు చేసే పంటల్లో తలెత్తే సమస్యలను నేరుగా శాస్త్రవేత్తలతో చర్చించే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా. ఐ తిరుపతి, డా. యు స్రవంతి, ఏ నాగరాజు పాల్గొన్నారు.

టీపీఏ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

నవతెలంగాణ-మంచిర్యాల

అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్(టీపీఏ) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్‌లో గల మహిళ సైకాలజిస్ట్‌లను శాలువాతో సన్మానించి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్వొకెట్ రంగు వేణు కుమార్ మాట్లాడుతూ మహిళలను ప్రతి ఒక్కరు గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ రావు, జిల్లా ప్రధానకార్యదర్శి సుమన చైతన్య, అసోసియేషన్ సభ్యురాలు పోష్ ఆక్ట్ చైర్‌పర్సన్ తాళ్ళపల్లి కవిత, ఉపాధ్యక్షుడు మొగిలి, జాయింట్ సెక్రటరీ సృజన, సలహాదారు గుండేటి యోగీశ్వర్, సభ్యులు నాగరాజ్, దీప్తి కిరణ్ ఎల్గొన్నారు.

ఎస్టీపీపీకి జాతీయ స్థాయి ఎఫీసియెన్సీ అవార్డు

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ మరో అవార్డు స్వంతం చేసుకుంది. జాతీయ స్థాయిలో గోవా వేదికగా మిషన్ ఎనర్జీ ఫౌండేషన్ అవార్డు ప్రదానం చేసింది. గోవాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక మీదుగా సోమవారం ఎస్టీపీపీ ప్రతినిదిగా డీజీఎం ఈఅండ్ఎం మహేందర్ అవార్డు అందుకున్నారు. మిషన్ ఎనర్జీ ఫౌండేషన్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి అవార్డు-2025లో భాగంగా ఎస్టీపీపీకి 7వ సంవత్సరానికి గాను నెట్ హీట్ రేట్ తగ్గించడంలో ఈ అవార్డు ఎస్టీపీపీకి దక్కింది. 1000 మెగావాట్లు ఆపైన దక్షిణ భారత థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ బెస్ట్ ఎనర్జీ ఎఫిసియెంట్ ప్లాంట్-2025గా గుర్తించబడింది.

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

నవతెలంగాణ-నస్పూర్

మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన భాద్యత ప్రతి ఒక్కరుపై ఉందని శ్రీరాంపూర్ సీఐ వెనుచందర్ అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలోని మొక్కలకు నీటిని పోశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మనిషి మనుగడ ప్రకృతితో ఆధారపడి ఉందని, ప్రకృతి బాగుండాలంటే చెట్లను నాటాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో జరిగే వేడుకలకు మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుతో హర్షం

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్కి రూ.200 కోట్లు కేటాయించినందుకు పాలాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, సిద్ధం తిరుపతి, నస్పూరి నర్సింగ్, విక్రంరావు, దుర్గం పోశం, మైదం రమేశ్, గోలేటి స్వామి, ఆల్క రాజు, కుర్మ నర్సయ్య, దాగం రాజలింగు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి

నవతెలంగాణ-నస్పూర్



క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, యువత క్రీడా స్పూర్తిని కలిగి ఉండాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు అన్నారు. మంగళవారం ప్రగతి స్టేడియంలో సింగరేణి 11 ఏరియాలో ప్రయివేట్ సెక్యూరిటీ గార్డులకు నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను కేంద్ర డిప్యూటీ సెక్రటరీ గరిగె స్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఉల్లాసంగా క్రీడల్లో పాల్గొనాలని, ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్స్ జీత భత్యాల గురించి, హాస్పటల్‌లో మెడికల్ ట్రీట్మెంట్ కోసం మినిమం వేజ్ బోర్డు కార్పొరేషన్ చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ అనేక సమావేశాల్లో మాట్లాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఏరియా కార్యదర్శిలు, సెక్రటరీలు, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు, పాల్గొన్నారు.

వేలాల మల్లన్న ఆలయంలో చోరీకి యత్నం

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిదిలోని వేలాల గ్రామంలో గల మల్లిఖార్జున స్వామి ఆలయంలో దుండగుడు చోరీకి యత్నించారు. సోమవారం అర్ధరాత్రి ఆలయ గర్భగుడి తలుపులు పగుగొట్టె ప్రయత్నం చేసి విఫలమైన దుండగులు బియ్య హూండీని పగులగొట్టి అందులో గల బియ్యంతో పాటు చిల్లర డబ్బులు దొంగిలించారు. విషయం తెల్సుకున్న జైపూర్ ఎస్ఐ శ్రీధర్ మంగళవారం ఉదయం సంఘటనా స్థలాన్ని సంధర్శించి చోరికి యత్నించిన సుందిళ్ల తిరుపతిని అదుపులోకి తీసుకున్నారు. సీసీ కెమెరా ఫుటేజీ అధారంగా అదే గ్రామానికి చెందిన సుందిళ్ల తిరుపతి చోరీకి యత్నించినట్లు గుర్తించారు. బియ్యం హూండీ నుండి దొంగలించిన బియ్యంతో పాటు రూ.వెయ్యి చిల్లర డబ్బులతో తిరుపతిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

ఎస్టీపీపీ 3వ యునిట్
పనులకు త్వరలో శ్రీకారం

- గడువులోగా పూరి చేసేందుకు చర్యలు
- బీహెచ్ఈఎల్ సంస్థతో సీఎండీ ఒప్పందం
- పూర్తయితే రూ.300 కోట్ల ఆదాయం

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ అనుసందానంగా నిర్మించ తలపెట్టిన 3వ యూనిట్ పనులకు త్వరలో శ్రీకారం చుట్టనున్నారు. నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు యాజమాన్యం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుత 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆవరణలో 3వ యూనిట్ 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణ పనులను నాలుగు సంవత్సరాల వ్యవధితో పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు సింగరేణి భవన్‌లో సీఎండీ ఎస్ బలరామ్ నాయక్‌తో నిర్మాణ సంస్థ బీహెచ్ఈఎల్ (భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్) ప్రతినిదుల మధ్య ఒప్పందం కుదిరింది. 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆవరణలో 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే టెండర్లు పూర్తిగా నిర్మాణ సంస్థతో సింగరేణీ సీఎండీతో పాటు ఇతర డైరెక్టర్లు సోమవారం సాయంత్రం సమావేశమయ్యారు. గరిష్టంగా 40 నెలల వ్యవధితో 3వ యూనిట్ నిర్మాణం పూర్తి చేసేందుకు నిరంతర పర్యవేక్షన ఉండాలని సూచించారు. వచ్చే నెలలో 3వ యూనిట్ నిర్మాణ పనులు ప్రారంభించాలని సీఎండీ ఎస్ బలరామ్ కోరారు.



ఒప్పంద పత్రాలతో బీహెచ్ఈఎల్, సింగరేణి సీఎండీ



సింగరేణికి రూ. 300 కోట్ల అదనపు ఆదాయం

బీహెచ్ఈఎల్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ నిర్మాణ పనుల పూర్తి అయితే సింగరేణికి ఏటా రూ. 300 కోట్లు అదనపు ఆదాయం సమకూరనుంది. కాగా బాయిలర్స్, టర్బైన్స్, జనరేటర్ల (బీటీజీ) ఏర్పాటుతో పాటు అన్ని రకాలైన సివిల్ తదితర నిర్మాణాలను 48 నెలల్లో నాలుగేళ్లలో పూర్తి చేయాల్సివుంటుంది. ప్రస్తుతం సింగరేణి సంస్థ 2016లో పూర్తయిన 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం విజయవంతంగా నడుస్తున్న కంపెనీకి ప్రతి ఏడాది సుమారుగా రూ.450 కోట్ల వరకు లాభాలను అర్జించి పెడుతుందని సీఎండీ తెలిపారు. ఇప్పటి వరకు ఈ ప్లాంట్ సుమారు రూ. 70 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను రాష్ట్ర అవసరాలకు అందిస్తోంది. ఈ నేపథ్యంలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం పలుమార్లు దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రాలలో కెల్లా అత్యధికంగా ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్(పీఎల్ఎఫ్) సాదిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది. ప్లాంట్ పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ ఇదే ప్రాంగణంలో 3వ యూనిట్ స్థాపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయింది.

ప్రాధాన్యతా క్రమంలో ప్లాంట్ నిర్మాణం పూర్తి

ఎస్టీపీపీ ఆవరణలో నిర్మాణం చేపట్టనున్న 3వ యూనిట్ పనులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయనున్నట్లు భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ జీఎం అండ్ హెడ్ పార్థసారధి దాస్ వెల్లడించారు. సింగరేణి పవర్ ప్లాంట్ అతి ప్రాధాన్యత ప్రాజెక్టుగా బీహెచ్ఈఎల్ బోర్డు నిర్ణయించదని తెలిపారు. గతంలో చేపట్టిన 1200 మెగావాట్ల ప్రాజెక్టులో ఎదురైన సమస్యలను అధిగమించే విధంగా ముందస్తు ప్రణాళికలతో పనులకు రూపొందించినట్టు ఆ సంస్థ జీఎం తెలిపారు. బీహెచ్ఈఎల్ ప్రతినిదులతో సింగరేణి సీఎండీ బలరామ్‌తో పాటు డైరెక్టర్లు ఈఅండ్ఎం సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ పీఅండ్పీ వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్‌డీ సుభాని, బీహెచ్ఈఎల్ సంస్థకు చెందిన జోగేష్ గులాటి, సింగరేణి విద్యుత్ విభాగం ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టైగర్ జోన్ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కవ్వాల్ టైగర్ జోన్ వైల్డ్ లైఫ్ సమస్యలను నేటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఎంపీడో కార్యాలయ సమావేశ మందిరంలో మాట్లాడారు. ఇక్కడి ప్రజలు వాహనదారులు టైగర్ జోన్ వైల్డ్ లైఫ్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో ఈ సమస్యలపై ముఖ్యమంత్రి అటవీ శాఖ మంత్రులకు విన్నవించడం జరిగిందన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. కడెం ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న రైతుల పంట పొలాలు ఎండిపోకుండా, సరైన సమయంలో నీటిని అందిస్తున్నామని తెలిపారు. చివరి ఆయకట్టు వరకు రైతుల పంటలు ఎండిపోకుండా నిరంతరం నీరు ఇస్తామన్నారు. నీటిని వృధా చేయకుండా రైతులు సక్రమంగా తమ పంటలకు వాడుకోవాలన్నారు. అలాగే ఎండలు తీవ్రమైతున్న తరుణంలో తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందన్నారు. ముందు నుంచే అధికారులు అప్రమత్తమై తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జాఫర్ అలీ, మేకల మాణిక్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫాసియుల్లా మాజీ ఎంపీపీ మాచ్చ శంకరయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం సతీష్, మాజీ ఎంపీటీసీ రియాజుద్దీన్ నందు నాయక్ దాముఖ కరుణాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వం కొత్తగా రూపొందించిన మోనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో గల కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసర ప్రాంతంతో పాటు పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న కళాశాల నిర్మాణ పనులు పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాల భోజనశాలలో విద్యార్థుల కోసం వండిన భోజన పదార్థాలను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థుల తరగతి గదుల్లో వార్షిక పరిక్షలకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యార్థులతో అభ్యాసన చేయించాలని సూచించారు. అనంతరం మండల పరిధి కిష్టాపూర్, నర్వ, రసూల్‌పల్లి, టేకుమట్ల గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న జాతీయ రహదారి పనుల పురోగతిని పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాపురావు, జాతీయ రహదారి కాంట్రాక్టర్ బాధ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణిలో పదవి విరమణ పొందిన పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, జాతీయ సేఫ్టీ అండ్ స్టాండింగ్ కమిటీ సభ్యులు కొత్త కాపు లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం బీ ఎ స్ ఎ ం ఎ స్ కార్యాలయంలో సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బీఎంఎస్ అధ్యక్షతన అధ్యక్షుడు పులి రాజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పదవి విరమణ పొందిన పెన్షనర్స్ అపరిష్కృత సమస్యలపైన సుదీర్ఘంగా చర్చించిన అనంతరం బొగ్గు పరిశ్రమలలో పనిచేస్తున్న పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి నిరంతరం అవిశ్రాంతంగా ప్రభుత్వ, యాజమాన్య ప్రతినిధులతో చర్చిస్తు సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ మాత్రమే కృషి చేస్తుందని తెలిపారు. పదవి విరమణ పొందిన ప్రతి కార్మికునికి రూ.5వేలకు తగ్గకుండా పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీమండ రమాకాంత్, కాశెట్టి నాగేశ్వరరావు, ఆగయ్య, పోచంపల్లి భీమయ్య, ఎం మల్లేష్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి మరిన్ని నిధులు కేటాయించాలి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన ఎంపీ వంశీకృష్ణ

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అనుగుణంగా నిధులు కెటాయించాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ కోరారు. మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, చామల కిరణ్, రఘురాంరెడ్డిలతో కలిసి మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ఈ సంధర్భంగా ఆయనతో సమావేశమై రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధుల కెటాయించాలని కోరారు. పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధి పనుల విషయమై కేంద్ర మంత్రితో చర్చించారు. ప్రధానంగా పెద్దపల్లి నియోజకవ్గం పరిధిలో రోడ్ల విస్తరణ, రైల్వే మార్గం అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, మౌళిక సదుపాయాల పెంపువంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు.



తాటి, ఈత చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ఇందన్‌పెల్లి, చింతలపల్లె గ్రామాల్లో తాటి, ఈత చెట్లను రంపంతో కట్ చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు మూల భాస్కర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇందన్‌పెల్లిలో గీతా కార్మికులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాటి, ఈత చెట్లను తొలగించి నాలుగు రోజులు గడుస్తున్న అబ్కారి అధికారులు పట్టించుకోక పోవడం శోచనీయమని అన్నారు. ఈత, తాటి చెట్లను తొలగించడం వల్ల గీతా కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని చెట్లను తోలగించిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌తో పాటు అబ్కారి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇందన్‌పల్లి గ్రామ గౌడ కులస్తులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన మందమర్రి సీఐ

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని మంగళవారం మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, కాసిపేట ఎస్ఐ వి ప్రవీణ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సంధర్భంగా సీఐ మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు జరుగుతున్న పరీక్షలు సజావుగా సాగేందుకు, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాని సూచించారు. పరీక్షా కేంద్రం వద్ద ఇతరులు ఎవరూ ఉండకుండా చూసుకోవాలని, అప్రమత్తంగా నిఘా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యార్థులు భయం వీడి ప్రశాంతంగా పరీక్షలు రాయాలి'

నవతెలంగాణ-జన్నారం



టెన్త్ విద్యార్థులు భయం వీడి ప్రశాంతంగా పరీక్షలా రాయాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జంగం సంతోశ్ సూచించారు. మండలంలోని కలమడుగు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థికి జీవితంలో ఓ మలుపు లాంటివని, పరీక్షలను విద్యార్థులు ఆత్మస్థైర్యంతో రాయాలన్నారు. పదో తరగతి పరీక్షలు చాలా విలువైనవని, ఉన్నత చదువుల కోసం పదోతరగతి ఉత్తీర్ణత అవ్వడం మొదటి మెట్టు అని, విద్యార్థులు భయాన్ని వీడి ప్రశాంతంగా, ధైర్యంగా పరీక్షలు రాయాలని వారు అన్నారు. విద్యార్థులకు పాడ్స్, పెన్స్, పెన్సిల్స్ పంపిణీ చేసినందుకు గ్రామస్తులు జంగం సంతోష్ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు కట్ట రాజమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందిస్తాం

నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ.. ప్రతి పేదోడికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 92 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ, 5 మందికి షాదిముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మీ పథకం ఆర్థికంగా ఎంతో మేలు చేకుర్చుతుందని అన్నారు. ప్రతి ఆడపడుచుకు పెళ్లి అనంతరం రూ. లక్ష 116 అందిస్తుందని పేర్కొన్నారు. సకాలంలో చెక్కులను బ్యాంకులో జమ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్‌రావు ఇతర అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అటవీశాఖ బీట్ అధికారికి సెక్షన్ అధికారిగా ఉద్యోగోన్నతి

నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్‌లో అటవీ డివిజన్‌లోని ఇంధన్‌పల్లి రేంజిలో అటవీశాఖ బీట్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఎండీ ముజీబుద్దీన్‌ను అటవీశాఖ సెక్షన్ అధికారిగా పదోన్నతి కల్పిస్తూ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతి పొందిన ముజీపుద్దీన్‌ను మంచిర్యాల డివిజన్ మంచిర్యాల రేంజి పరిధి లోని పెగడపల్లి సెక్షన్‌కు కేటాయించారు. ఈ మేరకు ఉద్యోగోన్నతి పొందిన ముజీబుద్దీనన్ను ఇంధన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్, అటవీశాఖ అధి కారులు, సిబ్బంది అభినందించారు.

మహిళలకు ఆటల పోటీలు

నవతెలంగాణ-మందమర్రి

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు పాటలు, ఆటల పోటీలను నిర్వహించారు. మంగళవారం రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో మహిళలకు పాటలు, ఆటల పోటీలు కబడ్డీ, లెమన్ స్పూన్, టాగ్ ఆఫ్ వార్, మ్యూసికల్ చైర్, బంప్ బ్లాస్ట్ నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మహిళలను శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమములో జి రాజు, లలిత, సుమతి, మానస పాల్గొన్నారు.

యాసంగి పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలి

నవతెలంగాణ-జన్నారం

యాసంగి పంటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులకు మంగళవారం రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. 'యాసంగి సీజన్‌లో పంటల సాగు జాగ్రత్తలు' అనే అంశంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. పంటల ఎదుగుదలకు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. పంటలు ఎండిపోకుండా సరైన నీటి తడులను ఇస్తూ తమ పంటలను కాపాడుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ సంగీత, ఏఈఓలు పాల్గొన్నారు.

చిరువ్యాపారులతో కలెక్టర్, ఎస్పీ సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ట్రాఫిక్ సమస్య దష్ట్యా చిరువ్యాపారులతో మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్యను నిర్మూలించడానికి సంబంధించిన విషయాలను చర్చించారు. అందులో భాగంగా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వినోద్ కుమార్, డిఎస్పీ జీవన్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ రాజు, అధికారులు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఎంపీడీఓ ఆగ్రహం

నవతెలంగాణ-దస్తురాబాద్



మండలంలోని బుట్టాపూర్ గ్రామ పంచాయతీని మంగళవారం ఎంపీడీఓ రమేశ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భాంగా గ్రామపంచాయతీలోని పలు రికార్డులు, నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కలు మొలకెత్తక పోవడంతో పంచాయతీ కార్యదర్శి రవీందర్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో నర్సరీలో మొక్కలు మొలకెత్తెవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే వర్మీ కంపోస్టు ఎరువుల తయారిపై దృష్టి సారించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో మురుగు కాలువలు, చెత్తను తీసేయడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీఓ రమేశ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవీందర్ ఉన్నారు.

ఐదు క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని గొల్లవాడలో సల్మాన్ అనే వ్యక్తి ఆటోలో ఐదు క్వింటాళ్ల రాయితీ బియ్యం తరలిస్తుండగా మంగళవారం పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజ్ కుమార్ తెలిపారు. సల్మాన్ పై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వం అందించే ఉచిత బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట బెజ్జూర్ గిర్దవర్ సంతోష్ ఉన్నారు.

14 మంది పేకాట రాయుళ్లపై కేసు నమోదు

నవతెలంగాణ-బెజ్జూర్

మండలం కృష్ణపెల్లి గ్రామంలో సోమవారం రాత్రి పేకాట స్థావరంపై ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. సమాచారం మేరకు బుష్ణపెల్లి శివారులో పేకాట ఆడుతున్న 14 మంది పేకాట రాయళ్లను పట్టుకొని రూ.2150 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట, జూదం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా వాసికి గ్రూప్-2లో రాష్ట్ర 19వ ర్యాంక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



టీఎస్పీఎస్సీ గత సంవత్సరం నిర్వహించిన గ్రూప్-2 ఫలితాలు మంగళవారం విడుదల చేయగా జిల్లా కేంద్రానికి చెందిన శ్రీరామ్ శివకృష్ణ రాష్ట్రంలో 19 ర్యాంకు జోన్‌లో 4వ ర్యాంకు పొందాడు. టీజీపీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లో 412.050 మార్కులు సాధించి ర్యాంకు పొందాడు. శివకృష్ణ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీరామ్ సత్యనారాయణ, వాణిశ్రీ ఇద్దరు కుమారుల్లో పెద్దవాడు. సత్యనారాయణ జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో విధులు నిర్వహిస్తుండగా శివకృష్ణ అదే పాఠశాలలో చదివి అనంతరం ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించారు. అనంతరం సింగరేణిలో నిర్వహించిన ఉద్యోగానికి 12వ ర్యాంకు సాధించి కాసిపేట గనిలో విధులు నిర్వహిస్తునే, గత సంవత్సరం ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆడిట్ సెక్షన్‌లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా గ్రూప్-2 ఫలితాల్లో 19వ స్థానం సంపాదించి అందరి మన్ననలు పొందుతున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాంకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. రానున్న రోజుల్లో గ్రూప్-1 సాధించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

రిమ్స్‌లో డాక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలోని వివిధ విభాగాల్లో స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులను భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పేర్కొన్నారు. గౌరవ వేతనంతో కూడిన కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయుటకు అర్హులైన వైద్యుల నుండి ప్రొఫెస్సర్స్, అసోసియేట్ ప్రొఫెస్సర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సూపర్ స్పెషలిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్స్, సీనియర్ రెసిడెంట్స్, సివిల్ అసిస్టెంట్ సర్జన్స్, సీఎంఓ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. కావున అర్హులైన వైద్య అభ్యర్థులు ఈనెల తమ ధ్రువపత్రాలతో ఈనెల 18న ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 04 గంటల వరకు రిమ్స్ మెడికల్ కళాశాలలో నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

ఉమ్మడి జిల్లా నాయకులతో మంత్రి భేటి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క నాలుగు జిల్లాల ముఖ్య నాయకులతో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలు అంశాలను నాయకులు మంత్రి దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. వేసవికాలంలో క్షేత్రస్థాయిలో ఎక్కడ తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని నాయకులకు సూచించారు. ఎప్పటికప్పుడు ప్రజల్లో ఉంటూ సమస్యలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండేవితల్‌తో పాటు ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గన్నరపు రమేష్ అన్నారు. మంగళవారం సంఘం జిల్లా 4వ మహాసభలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా నేతాజీ చౌక్ నుంచి బ్యాండ్ మేళ నడుమ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓ ఫంక్షన్ హాలులో కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు ప్రభుత్వాలకు కనిపిస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. సమగ్ర సంక్షేమ చట్టం తీసుకువచ్చి అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. కార్మికుల పనిముట్లకు ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకుల ద్వారా సబ్సిడి రుణాలను ఇవ్వాలన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్మిక వ్యతిరేక విదానాలను అవలంబిస్తు 44 చట్టాలను నాలుగు కోడ్లుగా చేసిందన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఈనెల 28న ఢిల్లీలో నిర్వహించే ధర్నానను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటి ప్రధాన కార్యదర్శి గాదే లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాడి పోషం, రాష్ట్ర కార్యదర్శి గాజేంగుల రాజు పాల్గొన్నారు.

వైభవోపేతం పద్మావతి శ్రీనివాస కల్యాణోత్సవం

నవతెలంగాణ-భైంసా

పట్టణంలోని లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పద్మావతి శ్రీనివాసుల కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. వేదపండితుల ఆధ్వర్యంలో చేపట్టిన కల్యాణ ఘట్టం కమనీయంగా కొనసాగింది. ఉదయం వేళ మాడ వీధుల్లో స్వామివారిని, పద్మావతి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించి, భక్తులు పెళ్ళికొడుకు, పెళ్లికూతురు బంధువులుగా మారి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక కల్యాణ మండపం ఏర్పాటుచేసి కల్యాణ ఘట్ట ప్రాముఖ్యతను వేద పండితులు వివరించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు, వేదపండితులు చేపట్టిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని స్వాగతించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనంద్‌రావ్ పటేల్, నాయకులు విలాస్ గాదేవార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బి.గంగాధర్, ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ ఆసిఫాబాద్



వీసీలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, డీఆర్డీఓ దత్తారావులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభివృద్ధి పనుల నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నెలాఖరులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవికాలంలో ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళికతో నిరంతరం తాగునీరు అందించే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. వేసవిలో గ్రామ పంచాయతీల పరిధిలోని నర్సరీలలో మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి దారించాలని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో ఆస్తి పన్నును 100 శాతం వసూలు చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. సీఎస్‌సీ నిర్మాణ పనులను పూర్తి చేయాలని తెలిపారు. లే అవుట్ లేని భూముల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్-2020లో భాగంగా అందిన దరఖాస్తులను రెవెన్యూ రికార్డులు, దస్తావేజులు సరిచూసి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కార్యచరణలో భాగంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ప్రజా పాలనలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అర్హత గల వారికి ఇందిరమ్మ ఇల్లు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో భాగంగా జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలకు 100 రోజులు పని దినాలు కల్పించాలని, అవసరమైన ప్రాంతాలలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. వేసవికాలం అయినందున పని ప్రదేశాలలో కార్మికుల ఆరోగ్య రక్షణ దిశగా ఉదయం, సాయంత్రం వేళలలో ఉష్ణోగ్రత తక్కువగా ఉన్న సమయంలో పనులు చేయించడంతో పాటు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, నీడ సౌకర్యం కల్పించాలని తెలిపారు. వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు అభివద్ధి పనులు పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు వరం కల్యాణలక్ష్మీ పథకం



ఖానాపూర్ : చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఖానాపూర్

నిరుపేద కుటుంబాలకు కల్యాణ లక్ష్మీ పథకం ఓ వరమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో 58 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవాడి ఆర్థిక భారాన్ని తగ్గించడంలో కల్యాణ లక్ష్మీ పథకం ఎంతో చేయూతను అందిస్తోందన్నారు. ఆడపడుచుల కుటుంబాలకు ఈ పథకం వల్ల చాలా మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : ఆడపిల్లల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మీ పథకం అమలు చేస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో 20 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాది ముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపడుచులకు కల్యాణ లక్ష్మీ, షాది ముభారక్ పథకం ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తుందన్నారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో అధికారులు నీటి ఉన్న గ్రామాలను గుర్తించి, నీటి సమస్యలను తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి : కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-భైంసా

విద్యాభివృద్ధియే ధ్యేయంగా ముందుకు సాగుతానని, నియోజకవర్గం విద్యారంగంలో మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ నిధులు ఉషా పథకం కింద రూ.మూడు కోట్ల 97 లక్షలతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి రూ.ఐదు కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మిగతా నిధులను కళాశాలలో కంప్యూటర్లు, ఇతరత్రా పనుల కోసం వెచ్చిస్తామన్నారు. విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కళాశాల అధ్యాపక బృందం స్వాగతించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే. బుచ్చయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బి.గంగాధర్, డాక్టర్ నగేష్ పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెబ్బెన

అంతర్జాతీయ విద్య ప్రమాణాలతో రాష్ట్రంలో రూ.11కోట్ల వేల కోట్లతో 55 యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు చేస్తూ విద్యశాఖ నుండి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేయడంతో పాటుజిల్లా మెడికల్ కళాశాలకు తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టినందుకు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని బస్ స్టాండ్ వద్ద అండర్ పాస్‌లో రాష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్ నియోజకవర్గానికి యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలకు రూ.200 కోట్లు కేటయించడం హర్షణీయమన్నారు. మండల అధ్యక్షులు లావుడ్య రమేష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గం దేవాజీ, మాజీ సర్పంచ్లు గంటుమేర, ముంజం రవీందర్, టౌన్ అధ్యక్షులు వనమాల మురళీ, నాయకులు దుర్గం రవీందర్, మోడెం చిరంజీవి గౌడ్, మోడెం రాజేంద్ర ప్రసాద్ గౌడ్, మండల మైనార్టీ అధ్యక్షుడు ఇమ్రోజ్, మండల యూత్ అధ్యక్షులు పుదరి సాయి, పెద్దలు మల్లారెడ్డి, అవిడపు గోపీ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి : డీఈఓ

నవతెలంగాణ-తిర్యాణి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య ఉపాధ్యాయులకు ఆదేశించారు. మంగళవారం మండలంలోని మండల పరిషత్ రాంబాయి గూడ, కన్నెపల్లి పాఠశాలలతో పాటు మాణిక్యపూర్ కేజీబీవీ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకు డీఈఓ పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు అయ్యేలా చూడాలన్నారు. కేజీబీవీ విద్యాలయంలోని 10వ తరగతి విద్యార్థులందరూ మంచి జీపీఏతో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కేజీబీవీ ఎస్ఓ స్వప్నకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ టీఏజీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ మధుకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వివిధ పనులను నిమిత్తం వచ్చే వారికి వాహనాల పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పార్కింగ్ స్థలం కేటాయించాలన్నారు. వేసవి తీవ్రత పెరిగిన నేపథ్యంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో యువత ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఓపెన్ జిమ్‌లు పెట్టాలన్నారు. జిల్లా కేంద్రంలో సులబ్ కాంప్లెక్స్ లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుండి వచ్చే మహిళలు ఇబ్బందులు పడుతున్నారని పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలన్నారు. జనకాపూర్ క్రీడా మైదానంకు సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కోరెంగ మాలశ్రీ, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి శ్రావణి పాల్గొన్నారు.

రోగుల పట్ల ఇంత నిర్లక్ష్యమా..?

- దురుసుగా ప్రవర్తిస్తున్న నర్స్



నవతెలంగాణ-రెబ్బెన

మండలం గోలేటి గ్రామంలోని బెల్లంపల్లి సింగరేణి ఏరియాలో కార్మికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సింగరేణి డిస్పెన్సరి మెడికల్ విభాగంలో సిబ్బంది రోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ పనిచేస్తున్న స్టాఫ్ నర్సు ప్రవర్తన బాగ లేదని రోగులు చెబుతున్నారు. రోగాలతో వెళ్తే కార్మిక కుటుంబాల్లోని వయోవృద్ధులు, చిన్నారులకు చేదు అనుభవం ఎదురవుతోందని వాపోతున్నారు. నర్సు వృత్తి అనగానే ముందుగా అందరికీ గుర్తుకు వచ్చేది సేవ, ప్రేమ, ఆప్యాయత, శాంతి, ఓపిక. కాని వీటన్నింటికీ భిన్నంగా దురుసు ప్రవర్తన, కోపోద్రేకం, నిర్లక్ష్యపు సమాధానం, అవహేళన మాటలతో ఇబ్బందులు పడుతున్నామని రోగులు పేర్కొంటున్నారు. ఇకనైనా స్థానికంగా ఉన్న సింగరేణి ఆస్పత్రికి అధికారులు ఎప్పటికప్పుడు సందర్శిస్తూ ప్రేమపూర్వకమైన వైద్యసేవలు అందించాలని కార్మికులతో పాటు స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన లెజిస్లేటివ్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఎల్పీ సమావేశానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పరిస్థితులను పార్టీ అధినేత కేసీఆర్‌కు వివరించినట్లు తెలిపారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన విధానాన్ని దిశా నిర్దేశం చేసినట్లు వివరించారు.

గ్రూప్-2 ఫలితాల్లో 229 ర్యాంక్

నవతెలంగాణ-రెబ్బెన



ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో మండలంలోని గోలేటి గ్రామానికి చెందిన కామ్రే భాస్కర్ రాష్ట్రస్థాయిలో 229 ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. మారుమూల ప్రాంతంలో ఉండి రాష్ట్రస్థాయిలో 229 ర్యాంకు సాధించి గ్రూప్-2లో మెరిసిన భాస్కర్ గోలేటి గ్రామంతో పాటు రెబ్బెన మండలానికి వన్నెతెచ్చారు.

వాలీబాల్ కిట్లు అందజేత



నవతెలంగాణ-వాంకిడి

కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని సవాతి గ్రామంలో వాంకిడి పోలీసులు యువకులకు వాలీబాల్ కిట్‌ను అందించారు. వేసవి సెలవుల సందర్భంగా యువత చెడు వ్యసనాలకు లోనూ కాకుండా ఇతరత్రా స్కిల్స్ పెంచుకోవడానికి పోలీసు శాఖ తరుపున సహకారం ఉంటుందని ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు. అనంతరం సవాతి, దామ గ్రామాల యువకులకు వాలీబాల్ కిట్టును అందజేశారు. క్రీడలు మానసికోల్లాసం కలిగిస్తాయని. ఈ వేసవి కాలం సెలవుల్లో వీటిని వినియోగించుకొని ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు లోనుకాకుండా ఉండాలని సూచించారు.

మోడల్ ఇంటిని పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-తలమడుగు



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటి పనులను మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో నిర్మాణం చేపట్టగా మంగళవారం ఎంపీడీఓ శేఖర్, తహసీల్దార్ రాజమోహన్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇస్తుందని, ఈ డబ్బులతో ఏ విధంగా నిర్మించుకోవాలనే ఉద్దేశంతో మోడల్ ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. వారి వెంట ఇంజనీర్ నసీర్ ఉన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నూతన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్పీని ఆదిలాబాద్ టీఎన్జీఓ యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీని శాలువాతో సత్కరించి పూల బొకే అందజేశారు. అంతకుముందు సంఘం డైరీతో పాటు క్యాలెండర్‌ను ఎస్పీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు సంద అశోక్, ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్ కుమార్, నాయకులు తిర్మల్‌రెడ్డి, చంద్ర మోహన్‌రెడ్డి, రాజేశ్వర్, చిట్ల గంగాధర్, ఫహీం, కె.రాజు, రవి కుమార్, తాలూకా బాధ్యులు అరుణ్, దత్తు, కలీం, సోహేల్, నితిన్, రజినీకాంత్, జిల్లా పోలీస్ కార్యాలయ పర్యవేక్షకులు అశన్న, సంజీవ్ పాల్గొన్నారు.

గొడ్డలితో మహిళపై దాడి



నవతెలంగాణ-మందమర్రి

మద్యం మత్తులో గొడ్డలితో మహిళపై దాడి చేసిన నిందితుడిని పోలీసులు రిమాడ్‌కు తరలించారు. సీఐ శశిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..పాత సీఎస్పీ రోడ్డులో నివాసముండే కుమార్ కొద్ది సంవత్సరాల నుండి అనారోగ్యంతో ఉండడంతో నస్పూర్ కాలనీకి వెళ్లి నివాసం ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం పాత సీఎస్పీ రోడ్డులోని తన తల్లి ఇంటికి వచ్చి మద్యం తాగుతున్నాడు. సోమవారం రాత్రి అతిగా మద్యం తాగి సమీపంలోని రాంబాయి ఇంటికి వెళ్లి తాగేందుకు నీరు కావాలని అడిగాడు. రాంబాయి కుమారుడు రవికుమార్ నీళ్లివ్వగా తాగి వెళ్లిపోయాడు. కొంచెం సేపటికి మళ్లీ వచ్చి నీళ్లు కావాలని అడిగగా రాంబాయి నీళ్లు లేవని చెబుతూ ఖాళీ బిందెను చూపించింది. కావాలనే నీరు ఇవ్వడం లేదని గొడ్డలి తీసుకొచ్చి దాడికి తెగబడ్డాడు. పోలీసులకు సమాచారం అందించగా వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి రాంబాయిని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం వరంగల్ తలించారు. రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుని కోసం గాలిస్తుండగా మంగళవారం జాతీయ రహదారి టోల్‌గేట్ వద్ద కుమార్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-నస్పూర్

డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న 7క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..నస్పూర్ నుండి కాగజ్‌నగర్ వైపు బియ్యంతో వెళ్తున్న డీసీఎంను రాంనగర్ సమీపంలో పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యం విలువ సుమారు రూ.2లక్షల77వేలు ఉంటుంది. విచారణ నిమిత్తం సీసీసీ పోలీస్‌స్టేషన్ ఎస్ఐకి అప్పగించారు.

అనుమానాస్పద మృతిపై విచారణ జరిపించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇచ్చోడలో విద్యార్థిని అనుమానాస్పద మృతిపై విచారణ జరిపించాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం టీఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్చోడ బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న లాలిత్య అనుమానస్పదంగా మృతి చెందిందని తెలిపారు. వరుసగా రాష్ట్రంలో వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థినులు చనిపోతున్న రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. వసతిగృహాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన వైద్యమందించాలని గత అనేక సంవత్సరాలు నుంచి కోరుతున్న పాలకులు స్పందించడం లేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 14 నెలల కాలంలో పదుల సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు చనిపోతున్న ప్రభుత్వం నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలం చెందిందని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి, లేకపోవడంతో విద్యారంగాన్ని సమీక్ష చేసి సమస్యలు పరిష్కారం చేయడం లేదని, తక్షణమే ఆశ్రమ పాఠశాలలో చనిపోయిన లాలిత్య మృతిపై సమగ్రమైన విచారణ జరిపించి, మృతురాలికి న్యాయం చేయాలని పేర్కొన్నారు.

14న హోలీ పండుగ జరపుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పౌర్ణిమ గురువారం వస్తున్నందున రాత్రి 12లోపు కామదహనం చేసి శుక్రవారం హోలీ పండుగ జరుపుకోవాలని గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ యోగానంద సరస్వతీ తెలిపారు. మంగళవారం సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గోపాలకృష్ణ మఠంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హోలీ పండగను శాస్త్రీయ పద్ధతి, ప్రకృతి సిద్ధంగా లభించే రంగులనే వాడాలని సూచించారు. ఎటువంటి రసాయనాలు కలువని సహజ సిద్ధ రంగులని వాడాలని అన్నారు. ఈ సమావేశంలో సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి గేడాం మాధవ్, సభ్యులు కందుల రవీందర్, రావులా వేణు, సుభాష్, నర్సింలు పాల్గొన్నారు.

ఒడి బియ్యం పోగు చేసుకోవడానికి బహిరంగ వేలం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి పోచమ్మ ఆలయం వద్ద ఒడి బియ్యం, చీరలు, కనుమలు ప్రోగు చేసుకొనుటకు ఈనెల 18 మంగళవారం ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లీజు హక్కు తేది 21 ఏప్రిల్ 2025 నుంచి 20ఏప్రిల్ 2026 వరకు ఒక సంవత్సరం పాటు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు సకాలంలో వచ్చి వేలం పాటలో పాల్గొనాల్సిందిగా కోరారు.

భూగర్భ జలాలు అడుగంటి పంటలకు నష్టం

నవతెలంగాణ-తాంసి



పంట వివరాలు తెలుసుకుంటూ అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వేసవికాలంలో వేసిన పంటలకు భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పంటలకు నీరు అందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జొన్న పంటలను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. పరిశీలనలో భాగంగా రైతులు తమ సమస్యలను వివరిస్తూ, పాత చెరువులో నీళ్ల నిలువ లేకపోవడంతోనే బోరు బావులు అడుగంటలకు పోతున్నాయని పాత చెరువుకు మరమ్మత్తులు చేసి రైతులకు సాగునీరు అందే విధంగా ప్రభుత్వం నిధులు కేటాయించి, పూడికతీత పనులు చేపట్టే విధంగా ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేస్తూ, తమ పంట పొలాల్లో ఉన్నటువంటి బోరుబావుల్లో వేసిన పంటలకు పూర్తిస్థాయిలో నీరు అందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడినట్లయితే పూర్తిస్థాయిలో నష్టపోకుండా నీళ్ళు సరిపోయేంతవరకు తమ పంటలను కాపాడుకోవాలన్నారు. విద్యుత్ సమస్య ఉన్నట్లయితే తెలియజేయాలని అన్నారు. గతంలో కంటే ఈ సంవత్సరం వర్షపాతం తక్కువ నమోదు కావడం ఒక కారణం అధిక మొత్తంలో వేసవి పంటలను వేసుకోవడం కారణంగానే బోరు బావుల్లో నీళ్ల అడుగంటుకపోయి నీటి సమస్య ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవీందర్, ఏఈఓ నిఖిత రైతులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఎల్ఆర్ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిష్కారంపై పంచాయతీ, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఈ నెల 31 లోపు పూర్తి ఫీజు చెల్లిస్తేనే 25 శాతం రాయితీ వర్తిస్తుందని వెల్లడించారు. జిల్లాలో మొత్తం 46వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే అధికారులకు దరఖాస్తుల పరిష్కారంపై అవగాహన, శిక్షణ అందించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎల్ఆర్ఎస్ ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, లోకల్ టీవీ ఛానళ్లలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో టాంటాం నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంపై రోజువారి రిపోర్టులను అందజేయాలన్నారు. సమావేశంలో డీపీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్‌గౌడ్, రాజేష్‌కుమార్, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

రిజర్వేషన్‌లలో బీసీ మహిళలకు ఉపకోట ప్రకటించాలి

నవతెలంగాణ-నస్పూర్



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దేశ జనాభాలో 60శాతం బీసీ జనాభా ఉంటే అందులో సగం బీసీ మహిళలే అయినప్పటికీ మహిళలకు పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు సముచిత స్థానం దక్కిన దాఖలాలు లేవని, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు ఉపకోట ప్రకటించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 76 సంవత్సరాల ప్రజాస్వామ్య దేశంలో కేంద్ర ప్రభుత్వ 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడతామని చెబుతోందని, అందులో బీసీ మహిళలకు 18శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు. బీసీ మహిళలకు ఉప కోట ప్రకటించకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు పెడితే అది కేవలం అగ్రకులాల మహిళా బిల్లుగా భావించాల్సి వస్తుందన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్న బిజెపి ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు వాటా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మహిళా సమాజం ముందు బిజెపి ప్రభుత్వాన్ని దోషిగా నిలబెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, శాఖపూరి భీమ్‌సేన్, అంకం సతీష్, పంపరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

కేజీబీవీ నూతన భవనం ప్రారంభం



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

కేంద్ర ప్రభుత్వ సమగ్ర శిక్షా అభియాన్ నిధులు రూ.4.15కోట్లతో సోన్ మండల కేంద్రంలో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ(కెజీబీవీ) నూతన భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.49.75లక్షలతో కేజీబీవీ భవన ప్రహరి గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ భవన నిర్మాణ పనులకు భూమి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, డీఈఓ రామారావు, డీఈ తుకారాం, పార్టీ మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, మాజీ ఎంపీపీలు సరికెల గంగన్న, హరీష్‌రెడ్డి, నాయకులు నరేష్, అశోక్, సాగర్, శ్రీనివాస్, నర్సయ్య, రాజేశ్వర్, సంతోష్, నాగయ్య పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలు సొంతంగా రాయాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

విద్యార్థులు పదో తరగతి పరీక్షలు సొంతంగా రాయాలని డీఈఓ పి.రామారావు అన్నారు. మంగళవారం సోన్ మండలం జడ్పిఎస్ఎస్ మాదాపూర్ పాఠశాలను సందర్శించి తొమ్మిది, పది తరగతులను సమీక్షించారు. పదవ తరగతి విద్యార్థులను ఒక్కొక్కరిని వారి ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఒకటి నుంచి పదవ తరగతి వరకు మొత్తం ఎన్ని రోజులు పాఠశాలకు వచ్చారని అడిగారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా సొంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని మార్గనిర్దేశం చేశారు. విషయాల వారీగా సిలబస్ గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. తరగతి వారీగా విద్యార్థుల హాజరు కూడా పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించి మెనూ ప్రకారం ఉండాలని సూచించారు.



సమయపాలన తప్పనిసరిగా పాటించాలి : డీఎంహెచ్ఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. మంగళవారం గుడిహత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది అందరూ సమయపాలన పాటిస్తున్నారా లేదా అని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ శ్యాంసుందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీని సందర్శించి మందుల స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు, రికార్డుల మెయింటెన్ గురించి వివరాలు తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్ ఉన్నారు.

సంఘ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నూతనంగా నిర్మిస్తున్న కుమ్మరి సంఘం భవనానికి నిధులు కేటాయించాలని కుమ్మరి సంఘం సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కుమ్మరి సంఘ నూతన భవనం నిర్మాణానికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని, అలాగే కుమ్మరులకు ఎల్లవేళలా వారి అభివృద్ధికి వారి వెంట ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం పట్టణాధ్యక్షులు కొత్తపల్లి రఘు, ప్రధాన కార్యదర్శి పోతుగంటి సంతోష్, కుమ్మరి జాగృతి సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు భూసారపు గంగాధర్, పట్టణ కోశాధికారి తోడిశెట్టి శ్రీనివాస్, సిలారీ సతీష్, గౌరవాధ్యక్షులు పోతుగంటి రాములు, సహ అధ్యక్షులు పోతుగంటి స్వామి, ఉపాధ్యక్షులు పోతుగంటి తుకారాం, రాజారపు సాయన్న, కొత్తపల్లి నగేష్, పోతుగంటి సాయికుమార్, ఆరెపల్లి గంగన్న పాల్గొన్నారు.

గ్రూప్-2 ఫలితాల్లో స్టేట్ 15వ ర్యాంక్ సాధించిన ముఖేష్

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



గ్రూప్-2 ఫలితాల్లో జిల్లా వాసి సత్తా చాటాడు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని కొల్హారి గ్రామానికి చెందిన బుద్దేవార్ నర్సింలు రాధ దంపతుల కుమారుడు బుద్దేవార్ ముఖేష్ 418 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గ్రూప్-2 ఉద్యోగం సాధించాడు. ముఖేష్ చిన్న తనం నుండే చదువులో చురుగ్గా ఉండేవాడు. పదో తరగతి వరకు సొనాలలో, ఇంటర్ ట్రిబుల్ ఐటి బాసరలో, ఖైరతాబాద్‌లో డిగ్రీ పూర్తి చేశాడు. డిగ్రీ పూర్తి అయిన తర్వాత పంచాయతీ కార్యదర్శి, గ్రూప్-4 జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడింది. తన ప్రయత్నంలోనే మూడు ఉద్యోగాలు సాధించాడు. 2019లో పంచాయితీ కార్యదర్శిగా ఎంపికయ్యాడు. 2021లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి 780వ ర్యాంక్ సాధించి, ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఆసిఫాబాద్‌లో ఇరిగేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ, గ్రూప్-2కు సన్నద్ధమయ్యాడు. మంగళవారం వెలువడిన గ్రూప్-2 ఫలితాల్లో తన ప్రతిభ కనబరిచి, రాష్ట్రంలోనే 15వ ర్యాంక్ సాధించాడు. తన మొదటి ప్రయత్నంలోనే మూడు ఉద్యోగాలు సాధించాడు. అంతే కాకుండా మండల కేంద్రానికి చెందిన బిట్లింగు ఉదయ్ స్టేట్ 51 ర్యాంక్ సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఉద్యోగం సాధించడం పట్ల తల్లితండ్రులు, మండల వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-బేల

మండలంలోని దహెగావ్ గ్రామంలో రూ.8లక్షలతో సీసీ రోడ్డు పనులకు బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు దత్త నిక్కం బీజేపీ నాయకులతో కలిసి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా దత్త నిక్కం మాట్లాడుతూ దహెగావ్ గ్రామంలో రాబోయే వర్షాకాలంలో జనాలు ఇబ్బందులు పడకుండా సీసీ రోడ్డులను నిర్మించాలనే ఉద్దేశంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో రూ.8లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళిధర్ ఠాక్రె, బీజేపీ సీనియర్ నాయకులు సందీప్, శివకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ పట్టణంలోని సాగర్ కాలనీలోని లేడ్జ్ హోమ్ వృద్ధాశ్రమంలో గంగోని కార్తీక్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని తెలియజేశారు. వీరితోపాటు సిద్ధి సాయి నగేష్, సాయితేజ్, వంశీ, శంకర్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రం



నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందస్తున్నందుకు గాను మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మెడికల్ ఆఫీసర్ నైనతకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఆమెను అభినందించారు.